RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 19 జూన్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:18౹౹

# బీఆర్ఎస్ వాళ్ల ఫ్యూచర్ ను ప్రజలు ఎప్పుడో రద్దు చేశారు



ఎల్ బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం అంటే నాకు ప్రత్యేక అభిమానం..

2018 శాసన సభ ఎన్నికల్లో రాజకీయ కుట్ర వల్ల కొడంగల్ లో ఓడిపోయినప్పుడు చాలా మంది ఇక ఏమీ కాదని నవ్వుకున్నారు..

సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అండగా నిలబడి మల్కాజ్ గిరి ఎంపీగా నాకు అవకాశం ఇచ్చారు..

ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గెలిపిస్తే ఒకరు మంత్రి పదవికి, మరొకరు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కోసం అందరిని మోసం చేసి పోయారు.

ఆ నాడు ఎంపీగా పోటీ చేసినప్పుడు ఎల్ బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 30 వేల మెజార్టీ ఇచ్చి ప్రశ్నించే గొంతును నిలబెట్టారు..

పార్లమెంటులో పార్టీ, ప్రజల తరుపున గట్టి గా నిలబడి కొట్లాడినప్పుడు సోనియా, రాహుల్ గాంధీ నన్ను గుర్తించి పీసీసీ అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చారు..

పీసీసీ చీఫ్ గా మూడేళ్లు కొట్లాడి లక్షలాది మంది ఆశీర్వాధంతో ప్రజా పాలనను ఏర్పాటు చేసుకున్నాం..

ఎల్ బీ నగర్ అసెంబ్లీ పరిధిలో నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా చెందిన వారు అధికంగా ఉంటారు..

ఈ ప్రాంతంలో వర్షాలు వచ్చి కాలనీలు మునిగిపోయినప్పుడు ఎంపీగా నేను పర్యటించాను..

సొంతూరు కొండారెడ్డి పల్లికి వెళ్తే ఎలాంటి అనుభూతి కల్గుతుందో ఎల్ బీ నగర్ కు వచ్చినప్పుడు కూడా అలాంటి అనుభూతే కల్గుతుంది..

ఇక్కడి ప్రజలు మా వాడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడని అభిమానంతో పలుకరిస్తారు..

రంగారెడ్డి జిల్లాలో ఒక వైపు మాత్రమే అభివృద్ధి జరిగింది..

ఎల్ బీ నగర్ , బీఎన్ రెడ్డి, వనస్థలిపురం , గుర్రం గూడా లాంటి ప్రాంతాలు అభివృద్ధి కాలేదు.. ఈ ప్రాంతాలకు నిధులు ఇవ్వాలని పాలకులు ఆలోచించలేదు..

ఈ ప్రాంతంలో 2400 కోట్లతో 240 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ఫ్రూట్ మార్కెట్ ను నిర్మిస్తున్నాం..

గుర్రంగూడా ఎకో పార్క్ ను ప్రైవేట్ భూములు గా చూపించి లే అవుట్లు చేసి అమ్ముకోవాలని ప్రయత్నం చేశారు.

సుప్రీంకోర్టులో ఉద్దండులైన న్యాయవాదులను పెట్టి కోర్టులో కేసు గెలిచాం..


గుర్రం గూడా లో 424 ఎకరాలను నేషనల్ పార్క్ గా ఇక్కడి ప్రజలకు అంకితం ఇచ్చాం..

చెరువులు నాలాలు ఆక్రమణ గురై కాలనీలు ముంపునకు గురి కావొద్దని ,పేదలు ఇబ్బంది పడొద్దని ఏర్పాట్లు చేయించాను..

సరూర్ నగర్ చెరువు ప్రాంతంలో బస్తీలు వరదల్లో మునిగిపోయాయి.

మిగతా 4 లో

## లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు:మహేష్ కుమార్ గౌడ్





లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు, భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ శుభాభినందనలు తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, రాజ్యాంగ స్ఫూర్తి కాపాడటం, సామాజిక న్యాయం సాధన కోసం శ్రీ రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. దేశ యువత, రైతులు, కార్మికులు, మహిళలు, వెనుకబడిన వర్గాల సమస్యలను దేశవ్యాప్తంగా ప్రజల మధ్యకు తీసుకెళ్లి వారి గొంతుకగా నిలుస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు.భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రల ద్వారా దేశ ప్రజల్లో ఐక్యత, సౌభ్రాతృత్వం, రాజ్యాంగ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో రాహుల్ గాంధీ పాత్ర విశేషమని అన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజా పక్ష నాయకుడిగా ఆయన దేశవ్యాప్తంగా విశ్వాసాన్ని పొందారని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరింత కాలం ప్రజాసేవలో కొనసాగాలని, సంపూర్ణ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.



ప్రజాబలం

19 జూన్ 2026 శుక్రవారం




## ప్రాంతీయ పార్టీల పని అయిపోయిందా...

అప్పట్లో బెంగాల్ ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ ఉన్నప్పుడు చికెన్ నెక్ రహదారి విషయంలో అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టింది. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. వ్యక్తిగతంగా అమిత్ షా రిక్వెస్ట్ చేసినప్పటికీ మమత కరగలేదు. పైగా కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారుల మీద ఉల్టా కేసులు పెట్టింది. బెంగాల్లో అడుగుపెట్టిన వారి మీద దాడి చేసింది.ఢిల్లీలో అప్పట్లో రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమం జరిగింది. గణతంత్ర దినోత్సవం రోజు ప్రధానమంత్రి జండా ఎగరవేసిన తర్వాత.. ఎర్రకోట మీద ఖలిస్తాన్ వేర్పాటు వాదులు జెండా ఎగరవేశారు. అప్పట్లో ఈ చర్యను ఆప్ ప్రభుత్వం సమర్ధించింది. అదే కాదు పంజాబ్ నుంచి.. హర్యానా నుంచి కొంతమంది ప్రతీప శక్తులు ఢిల్లీ రావడానికి కారణమైందిమహారాష్ట్రలో శివసేన అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ నాయకుల మీద విపరీతంగా కేసులు పెట్టారు. కొన్ని సందర్భాలలో వేరే శక్తులకు అవకాశం కల్పించారు. తద్వారా భారత ప్రభుత్వానికి ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడింది. అంతేకాదు, మాఫియా శక్తులు బలపడేందుకు శివసేన కారణమైందని అప్పట్లో ఆరోపణలు వినిపించాయి.ఇవన్నీ కూడా మోడీకి.. అమిత్ షా కు చికాకు కలిగించాయి. అందువల్లే ఈ దారుణాలకు ప్రాంతీయ పార్టీలు కారణమని వారు బలంగా నమ్మారు. పైగా దేశంలో జరుగుతున్న ఘోరాలకు.. అవాంఛనీయ సంఘటనలకు ప్రాంతీయ పార్టీలు దోహదం చేస్తున్నాయని వారిలో ఒక నమ్మకం ఏర్పడింది. ఇక అప్పటినుంచి వారు ఆపరేషన్ లోటస్ మొదలుపెట్టారు.కొన్ని సంవత్సరాల క్రితమే మహారాష్ట్రలో శివసేన పార్టీని నిలువునా చీల్చి పడేశారు మోడీ, షా. ఇప్పుడు ఏకంగా ఉద్ధవ్ వర్గంలో ఉన్న 9 మంది ఎమ్మెల్యేలలో ఆరుగురిని ఆకర్షించారు. కాకపోతే వారు నేరుగా బిజెపిలో చేరకుండా.. ఇతర పార్టీలో చేరబోతున్నారు. ఆ తర్వాత బీజేపీలోకి చేరడానికి ఆస్కారం కల్పిస్తున్నారు. మహారాష్ట్రలో ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. 2024 ఎన్నికల్లో మహారాష్ట్రలో చెప్పుకునే స్థాయిలో బిజెపి పార్లమెంటు స్థానాలను గెలుచుకోలేకపోయింది. అందువల్లే తమకు ప్రతిబంధకంగా ఉన్న శివసేనను మరొకసారి చీల్చి పడేసే పనిని భుజాలకు ఎత్తుకున్నారు మోడీ, షా.పశ్చిమ బెంగాల్లో టిఎంసి పార్టీకి 28 మంది ఎంపీలు ఉన్నారు. వారిలో ఇప్పుడు 20 మంది బయటకు వచ్చారు. వారంతా నేరుగా బిజెపిలో చేరలేదు. ఎన్ సి పి ఐ పార్టీలో చేరారు. వీరంతా దశలవారీగా మళ్లీ బిజెపి తీర్థం పుచ్చుకుంటారు. కేవలం ఎంపీలు మాత్రమే కాదు ఎమ్మెల్యేలు కూడా దాదాపు 58 మంది వేరే కుంపటి పెట్టారు. ప్రతిపక్షంగా తమనే గుర్తించాలని ఇప్పటికే స్పీకర్ కు లెటర్ రాశారు.మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ కంటే ముందుగానే ఆమ్ ఆద్మీ పార్టీలో కొంతమంది రాజ్యసభ సభ్యులు బిజెపిలో చేరారు. దీంతో ఎగువ సభలో బిజెపికి బలం పెరిగింది. రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను చీల్చివేయడం.. రాజ్యసభ సభ్యులను.. పార్లమెంట్ సభ్యులను చేర్చుకోవడం ద్వారా బిజెపి గెట్టి ప్లాన్ వేసింది. ఇదంతా కూడా పార్లమెంట్లో 2/3 మెజారిటీ కోసం.. ఎందుకంటే ప్రస్తుత ఎన్డీఏ భుత్వం టిడిపి, నితీష్ కుమార్ సపోర్ట్ తో నడుస్తోంది. ఆల్రెడీ బీహార్ లో నితీష్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో బిజెపి అభ్యర్థి ముఖ్యమంత్రి కొనసాగుతున్నారు.. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం బలంగా ఉంది.. ఇన్ని సానుకూలతలు కనిపిస్తున్న నేపథ్యంలో బిజెపి పెద్దలు వేసిన స్కెచ్ భారీగానే ఉంది.పార్లమెంట్లో బలం పెంచుకోవడం.. అప్పర్ హౌస్ లో మరింత స్ట్రాంగ్ గా ఉండడంతో కీలకమైన బిల్లులు ఆమోదింప చేసుకోవాలని మోడీ, షా భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు.. డిలిమిటేషన్.. ఇంకా చాలా బిల్లులు ఈ టర్మ్‌లోనే పూర్తి చేసుకొని.. 2027 లేదా 2028 ఎన్నికలకు సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని మోడీ, షా భావిస్తున్నారు.. బీహార్ లో జేడీయు.. ఆంధ్రప్రదేశ్లో టిడిపి ఎన్డీఏ ప్రభుత్వానికి సపోర్ట్ ఇస్తున్నాయి. అలాంటప్పుడు ఆ పార్టీల కోరికలు తీర్చాల్సిన అవసరం లేకుండానే.. బిజెపి ఇలా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను టార్గెట్ చేసి.. ఓడిస్తోందని.. ఆ పార్టీల ఎంపీలను కలిపేసుకుంటున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆపరేషన్ లోటస్ రాకెట్ వేగంతో దూసుకుపోతోంది. దీనిని ఆపే ప్రయత్నం గాని.. ఆపే సాహసం గాని ఎవరూ చేయడం లేదు. మరో వైపు ప్రాంతీయ పార్టీలకు ఒకే కుటుంబం ఆధిపత్యం వహిస్తుంది. పార్టీని వృద్ధిలోకి తీసుకురావడానికి ఎంతో కష్టపడిన సీనియర్ నాయకులను పక్కకు తప్పిస్తారు. ఇదే పార్టీలో అంతర్గత ఘర్షణలకు కారణమవుతుంది. చీలికలకు కారణమవుతుంది. పార్టీలోని యువతరం దీనిని సరిపెట్టుకోలేకపోతోంది. వంశపారంపర్య రాజకీయాలను యువతరం వ్యతిరేకిస్తోంది.అవినీతి ఆరోపణలు: ప్రాంతీయ పార్టీల్లో ప్రధానంగా కనిపించేది అవినీతి ఆరోపణలు. పార్టీ నాయకులు ఆరోపణలను ఎదుర్కోవడం, జైలుకు వెళ్లడం ఉమ్మడిగా కనిపించే అంశం. ఈ పార్టీల్లో అవినీతి తీవ్రమైన అంశమని చాలా మంది చెబుతూ ఉంటారు.నాయకత్వం అహంకారం: ప్రాంతీయ పార్టీల నాయకులు అహంకారాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. సెలబ్రిటీలు అహంకారంతో నెట్టుకొస్తారు. కానీ రాజకీయవేత్తలు ప్రజాబలంతో అధికారంలో కొనసాగుతారు. మద్దతుదారులకు దూరం అయినవారు అధికారానికి దూరం అవుతూ ఉంటారు. జరుగుతున్నది ఇదే.పరిపాలనలో పేలవత్వం: అనువంశిక పాలన మాత్రమే కాకుండా అవినీతి ఆరోపణలు ప్రాంతీయ పార్టీలను దెబ్బతీస్తున్నాయి. అంతేకాకుండా సరైన పాలన లేకపోవడం కూడా ఒక కారణం. ఆర్థిక పరమైన బలహీన పరిస్థితి, కులాలు, ఇతర వర్గాలపై అతిగా ఆధారపడటం, మతపరమైన కారణాలు మొదలైన వాటివల్ల ప్రాంతీయ పార్టీలు క్షీణిస్తున్నాయి.నేర్చుకోవలసిన పాఠాలు: ఒడిశాకు 24 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన నవీన్ పట్నాయక్ చక్కని ఉదాహరణ. రాజకీయ అనువంశికంపై ఆయన ఆధారపడలేదు. ఆయన పాలనలో అవినీతి ఆరోపణలు ఎక్కువ రాలేదు. రాష్ట్రాన్ని ఆయన మంచిగా పరిపాలించారు. ప్రాంతీయ పార్టీల పతనానికి అవే కారణాలు. ఇతరులను నిందించడం ఎందుకు?ప్రాంతీయ పార్టీలను బీజేపీ మింగేస్తోందన్న ఆరోపణలు మీడియా చర్చల్లో తరచూ వస్తున్నాయి. కాంగ్రెస్ ఇతర పార్టీలను తమ పార్టీలో కలుపుకోవాలని చూస్తోందన్న అభిప్రాయం కూడా ఉంది. రాజకీయాల్లో పోటీ తత్వం పెరిగింది. ఓడిన వారి పట్ల సానుభూతి చూపరు. కొన్ని దేశాల్లో ఓడిన నాయకులు జైళ్లలో మగ్గడమో, నికృష్టమైన జీవనం గడపడమో చూస్తున్నాం. ప్రాంతీయ పార్టీల పతనానికి అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం ప్రధాన కారణాలు. ప్రాంతీయ పార్టీలు మారుతున్న వాస్తవాలను దృష్టిలో ఉంచుకుంటే అవి నిలదొక్కుకోగలుగుతాయి. అలా చేయలేకపోతే అవి రాజకీయ యవనికపై నుంచి తెరమరుగు అవుతాయి. ఇతరులను నిందించడం ఎందుకు? మార్పులను ఆహ్వానించవల్సిందే, లేదా కాలగర్భంలో కలిసిపోవల్సిందే.

## ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్ విడుదల చేయండి: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టీజీఎస్ఆర్టీసీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సచివాలయంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.2023-26 మధ్యకాలంలో ప్రజా పాలన ప్రభుత్వం రూ.1,078 కోట్ల వ్యయంతో 2,815 నూతన బస్సులను కొనుగోలు చేసిందని తెలిపారు. అలాగే ఏటూరు నాగారం, పెద్దపల్లి ప్రాంతాల్లో రెండు కొత్త డిపోలను మంజూరు చేసినట్లు వెల్లడించారు.తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిని ప్రాథమిక వైద్య సేవల స్థాయి నుంచి సూపర్ స్పెషాలిటీ సేవలు అందించే ఆసుపత్రిగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్, మెడికల్ ఇన్వాలిడేషన్ కింద మొత్తం 1,137 కారుణ్య నియామకాలు చేపట్టినట్లు చెప్పారు. వీరిలో 888 మంది కండక్టర్లు, 10 మంది డ్రైవర్లు, 43 మంది శ్రామిక్‌లు, 196 మంది కానిస్టేబుళ్లు ఉన్నారని వివరించారు.ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి మెరుగుదలకు ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల సీఎస్ఎస్ బకాయిలు రూ.1,096.90 కోట్ల నుంచి రూ.862 కోట్లకు తగ్గాయని, పీఎఫ్ బకాయిలు రూ.2,018.15 కోట్ల నుంచి రూ.1,714.39 కోట్లకు తగ్గాయని తెలిపారు. అలాగే ఎస్ఆర్బీఎస్, ఎస్బీటీ బకాయిలను కూడా రూ.493.02 కోట్ల మేర తగ్గించినట్లు పేర్కొన్నారు.పెండింగ్‌లో ఉన్న అర్హులైన కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వీసు నుంచి తొలగించబడిన 490 మంది ఉద్యోగుల్లో ఇప్పటికే 244 మందిని విధుల్లోకి తీసుకున్నామని, మిగిలిన కేసులను త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. మహాలక్ష్మీ పథకం మహిళల ఆర్థిక సాధికారతపై చూపుతున్న ప్రభావాన్ని అధ్యయనం చేసి ఫీడ్‌బ్యాక్ నమోదు చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలను 553 బస్సులకు యజమానులుగా చేసి ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన అందిస్తున్న నేపథ్యంలో వారి అభిప్రాయాలను కూడా సేకరించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,050 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని, అవి ఏ రూట్లలో నడుస్తున్నాయి, లాభదాయక రూట్లు ఏవి, నష్టాలు వస్తున్న మార్గాలు ఏవి అనే అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి,ఈడి లు,ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ త్రివేణివనం

## ఎకో పార్కును వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి

### పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది








**జహీరాబాద్, జూన్ 18 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణ శివారులో జాతీయ రహదారి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న త్రివేణివనం- ఫారెస్ట్ ఎకో పార్కును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం హైద్రాబాద్ నుండి వర్చువల్‌గా ప్రారంభించారు.

ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పచ్చని వాతావరణం నెలకొల్పాలనే లక్ష్యంతో వనమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 11 ఎకో పార్కులను ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించడం సంతోషకరమన్నారు.జహీరాబాద్ ప్రాంతం నిమ్జ్ ద్వారా పారిశ్రామిక స్మార్ట్ సిటీగా రూపుదిద్దు

కుంటోందని, భారీ పరిశ్రమలు రావడంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. జాతీయ రహదారి పక్కనే 208 ఎకరాల విస్తీర్ణంలో త్రివేణివనం అటవీ ఎకో పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో ఉన్న అన్ని సౌకర్యాలు త్రివేణివనంలో కల్పించినునట్లు చెప్పారు.

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. మానవాళికి ప్రాణవాయువును అందించే చెట్లు, అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను నాటి వాటిని సంరక్షించే అలవాటు చేసుకోవాలని కోరారు.

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కనే ఉన్న త్రివేణివనం- ఫారెస్ట్ ఎకో పార్కు ఎంతో ఆకర్షణీయంగా అభివృద్ధి చేయ

బడిందన్నారు. పార్కులో సైక్లింగ్ వంటి ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అధిక సంఖ్యలో సందర్శించి పార్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.

జహీరాబాద్ శాసన సభ్యులు మాణిక్‌రావు మాట్లాడుతూ త్రివేణివనం జహీరాబాద్ ప్రజలకు గొప్ప వరమని అన్నారు. మనిషి జీవితంలో చెట్లతో విడదీయరాని అనుబంధం ఉందని, చెట్లు ఉంటేనే మానవ మనుగడ సుసంపన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని కోరారు.

అనంతరం అతిథులు అటవీ శాఖ రూపొందించిన వనమహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పిమ్మట సఫారీ వాహనంలో ఎకో పార్కును సందర్శించి వివిధ సౌకర్యాలను పరిశీలించదంతో పాటు మొక్కలు నాటారు. అనంతరం జెండా ఊపి సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మున్సిపల్ చైర్మన్ యూనిస్, ఉజ్వల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా అటవీ అధికారి ప్రసాద్ రెడ్డి, నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, అటవీ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 'సూపర్ ఎల్నినో'.. ప్రమాదకర కరవు రానుందా?



హైద్రాబాద్ జూన్ 18 :ఇప్పటికే దేశంలో ప్రవేశించిన ఎల్నినో మరింత ప్రమాదకరంగా మారనుంది. ఇది వింటర్ నాటికి సూపర్ ఎల్నినోగా మారే ఛాన్స్ 63% ఉందని నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫెరిక్ అడ్మినిస్ట్రేషన్(US) తెలిపింది. దీంతో నైరుతి, ఈశాన్య రుతుపవనాలు బలహీనంగా ఉంటాయని, తీవ్ర కరవు ఏర్పడుతుందని IMD నిపుణులు వెల్లడించారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2o డిగ్రీలకు చేరుకోవడాన్ని సూపర్ ఎల్నినో అంటారు.

# డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆద్వర్యం లో అన్నదాన కార్యక్రమం




హైదరాబాద్ జూన్ 16; డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది నిరుపేదలు, అవసరమైన ప్రజలు మరియు ప్రయాణికులకుజీ ఉచితంగా భోజనం అందజేశారు.

సమాజ సేవే లక్ష్యంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం గొప్ప సేవ అని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సమాజంలోని పేద మరియు అవసరమైన వర్గాలకు అండగా నిలవడం కోసం డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ తరచుగా అన్నదాన కార్యక్రమాలు, ఉచిత ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు మరియు ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన దాతలు, వాలంటీర్లు మరియు పాల్గొన్న అందరికీ సొసైటీ ఎక్సగ్యుటీ మెంబర్ జి.మాధవి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## 21 న బాసర సరస్వతి సన్నిధి లో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక ధార్మిక సాంస్కృత కార్యక్రమములు



బాసర జూన్ 17 : శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపంలో గల శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ ము కోటి పార్థివశివలింగ శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగమందిర మాసోత్సవం సందర్భంగా 21న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ నున్నారు. ముందుగా దీపారాధన, కలశ స్థాపన ,విఘ్నేశ్వరశ్వర పూజ ,కోటి పార్థివ లింగ , శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగములకు మహా రుద్రాభిషేకం పుష్పార్చన , బిల్వార్చన , గోపూజ ,గణపతి, నవగ్రహ, రుద్రహోమములు, భూదాన సంకల్ప పూజ, మహా అన్నదానమునిర్వహించనున్నారు.సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భువనగిరి వాస్తవ్యులు ప్రముఖ నాట్య కళాకారిణి సిరి కూచిపూడి నృత్య నిలయం వ్యవస్థాపక అధ్యక్షులు నాట్య గురువులు శ్రీ అనూష గణేష్ శిష్య బృందముచే నృత్య ప్రదర్శన మరియు అష్టావధాన కార్యక్రమం నిర్వహించినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాధ శర్మ తెలిపారు.ఆసక్తిలవారు 99483 32032 సంప్రదించాలని నిర్వాహకులు ,వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాధశర్మ సంధ్య దంపతులు కోరారు.

# టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో 'మహిళా శక్తి క్యాంటీన్'ను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి



మింట్ కాంపౌండ్‌లోని టీజీఎస్పీడీసీఎల్ (TGSPDCL) ప్రధాన కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేయనున్న 'మహిళా శక్తి క్యాంటీన్'ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం సందర్శించి, పరిశీలించారు.

క్యాంటీన్ ఏర్పాటుకు అయిన మొత్తం ఖర్చు, అక్కడ ఉద్యోగులకు కల్పించిన వివిధ రకాల వసతులు, మౌలిక సౌకర్యాల గురించి ఆ సంస్థ సీఎండీ జితేష్ వి పాటిల్‌ను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు.

మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావలంబన, ఉద్యోగులకు పరిశుభ్రమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఈ క్యాంటీన్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

క్యాంటీన్ నిర్వాహకులతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి.. ఉద్యోగులకు, సందర్శకులకు ఎల్లప్పుడూ సరసమైన ధరలకే నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. అనంతరం క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన మెనూ బోర్డును, ధరల పట్టికను ఆయన నిశితంగా పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి సిఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు డైరెక్టర్ కమర్షియల్ చక్రపాణి, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ఐటి శివాజీ , డైరెక్టర్ ఆపరేషన్స్ చీ.నరసింహ ం , డైరెక్టర్ ఫైనాన్సు కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత...

# టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

### జహీరాబాద్ త్రివేణివనం- ఎకో పార్కును వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 18(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:జహీరాబాద్



పట్టణ శివారులో జాతీయ రహదారి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న త్రివేణి వనం- ఫారెస్ట్ ఎకో పార్కును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం హైద్రాబాద్ నుండి వర్చువల్‌గా ప్రారంభించారు,ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ పచ్చదనం పెంపు,పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి




చేస్తోందన్నారు,రాష్ట్రవ్యాప్తంగా పచ్చని వాతావరణం నెలకొల్పాలనే లక్ష్యంతో వనమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు,ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 11 ఎకో పార్కులను ముఖ్యమంత్రి వర్చువల్‌గా (ఎా ం ౕ ం బి, ం చ ౕ డ ౕ ం సంతోషకరమన్నారు,జహీరాబాద్ ప్రాంతం నిమ్జ్ ద్వారా పారిశ్రామిక స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకుంటోందని భారీ పరిశ్రమలు రావడంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు,జాతీయ రహదారి పక్కనే 208 ఎకరాల విస్తీర్ణంలో త్రివేణి వనం అటవీ ఎకో పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు,హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో ఉన్న అన్ని సౌకర్యాలు త్రివేణి వనంలో కల్పించినునట్లు చెప్పారు,టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. మానవాళికి ప్రాణవాయువును అందించే చెట్లు, అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను నాటి వాటిని సంరక్షించే అలవాటు చేసుకోవాలని కోరారు,జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కనే ఉన్న త్రివేణివనం- ఫారెస్ట్ ఎకో పార్కు ఎంతో ఆకర్షణీయంగా అభివృద్ధి చేయ

బడిందన్నారు,పార్కులో సైక్లింగ్ వంటి ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అధిక సంఖ్యలో సందర్శించి పార్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు,అనంతరం అటవీ శాఖ రూపొందించిన వనమహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పిమ్మట సఫారీ వాహనంలో ఎకో పార్కును సందర్శించి వివిధ సౌకర్యాలను పరిశీలించదంతో పాటు మొక్కలు నాటారు. అనంతరం జెండా ఊపి సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మున్సిపల్ చైర్మన్ యూనిస్, ఉజ్వల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా అటవీ అధికారి ప్రసాద్ రెడ్డి, నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్,అటవీ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన వి.హెచ్




ఈరోజు అలీ కేఫ్ ఫంక్షనాల్లో ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు వి హనుమంతరావు గారు 200 కల్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతా రోహిత్, ఎమ్మార్వో అన్వర్, డిప్యూటీ ఎమ్మార్వో బలరాం గౌడ్ , ఆర్ ఐ సునీత ,టిపిసిసి జనరల్ సెక్రటరీ ఆర్ లక్ష్మణ్ యాదవ్, టిపిసిసి సెక్రెటరీ శంబుల శ్రీకాంత్ గౌడ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల



ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు గరిగంటి రమేష్ ,దిండి రాంబాబు, రామ్మోహన్, శ్రీనివాస్ రెడ్డి, కోటం అనిల్, రావుల సుధాకర్ , సి సుధాకర్, మహేష్ గౌడ్, అలీమ్, సమ్మద్, విజితా రెడ్డి, శాంతమ్మ, షహనాజ్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

### కండలేరు లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

నెల్లూరుబుధవారం రాత్రి కండలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చెల్లటూరు గ్రామంలోని ఎస్టీ కాలనీలో పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్కు రాపూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గారి ఆధ్వర్యంలో కండలేరు ఎస్సై, కలువాయి ఎస్సై, సైదాపురం ఎస్సై మరియు 20 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పాల్గొంది. ఆపరేషన్ సందర్భంగా ప్రాంతంలోని సుమారు 120 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, సరైన ఆధార పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలు మరియు 2 ఆటోలను గుర్తించి స్వాధీనపరచుకుని తదుపరి పరిశీలన నిమిత్తం పోలీసుల ఆధీనంలో ఉంచారు. సంబంధిత వాహన యజమానులు అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. తరువాత స్థానిక ప్రజలు, యువత మరియు సంఘ పెద్దలకు రోడ్డు భద్రతా నియమాలు, గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, అక్రమ మద్యం నిర్మూలన, మహిళలపై జరిగే నేరాల నివారణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణ, డయల్-100 మరియు 112 అత్యవసర సేవల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రజలు తమ ప్రాంతాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలు, అసాంఘిక చర్యలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# బీఆర్ఎస్ వాళ్ల ఫ్యూచర్ ను ప్రజలు ఎప్పుడో రద్దు చేశారు



మొదటి పేజీ తరువాయి

కబ్జాదారుల కోరలను పీకాలని హైడ్రా ను తీసుకువచ్చాను..

హైడ్రాను బూతంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు..

సొంత స్థలాల్లో ఇళ్లు కట్టుకునే వారి జోలికి హైడ్రా వెళ్లదు..

పార్క్ లు, చెరువులు, నాలాలను కబ్జాలు పెట్టుకున్న వాళ్ల ఈపు సున్నం అవుతుంది..

వనస్థలిపురంలో గుడి స్థలాన్ని కబ్జా చేస్తే హైడ్రా విడిపించింది..

చెరువులను కబ్జా పెడితే నీళ్లు వెళ్లడానికి స్థలం లేక బస్తీల్లోకి వస్తున్నాయి..

కొద్ది మంది కబ్జాలు చేస్తే వేలాది మంది ప్రజలు కష్టనష్టాల పాలవుతున్నారు..

కబ్జాదారులు ఎంతవారైనా ప్రభుత్వం వదలదు..

ఢిల్లీ నగరం కాలుష్య కోరల్లో ఉంది...గాలి, నీరు విషం గా మారాయి..

పాలకులు కాలుష్యాన్ని నియంత్రించకపోవడం వల్లనే ఢిల్లీ నగరానికి ఈ పరిస్థితి దాపురించింది..

ముంబయిలో వర్షం వస్తే 24 గంటలకు బయటకు రాని పరిస్థితి ..

బెంగళూరులో ట్రాఫిక్ జాంలు ఉన్నాయి..

హైదరాబాద్ ను విశ్వ నగరంగా మార్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నాం..

మూసీని ప్రక్షాళన చేస్తామంటే అడ్డుపడుతున్నారు..

గతంలో మూసీ నదిలో నివసించిన వాళ్లను నందనవనం కాలనీ కట్టి అక్కడికి తరిలించారు..

ఇప్పుడు నందనవనం కాలనీ చాలా కీలకంగా మారింది..

హైదరాబాద్ లో ఆనాటి పాలకులు హైటెక్ సిటీ , అవుటర్ రింగ్ , అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ సంస్థలను నిర్మించకపోతే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేది కాదు..

శంషాబాద్ విమానాశ్రయం భూ సేకరణ లో దేవేందర్ గౌడ్ కృషి ఎంతో ఉంది..

సిరిస్ కంపెనీ దెబ్బకు ఎల్ బీ నగర్ ప్రాంతంలో నీరు కలుషితం అయింది..

భూములు విలువలు లేకుండా పోయాయి..

మూసీ కాలుష్యం వల్ల ఈ ప్రాంతంలో అనేక ఇబ్బందులు పడ్డారు..

మూసీ ప్రక్షాళన చేయాలి, చెరువులను కబ్జాల నుంచి విడిపించాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది..

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తుంటే వద్దంటున్నారు..

అక్కడ ఫార్మా కంపెనీలే ఉండాలి, ఫ్యూచర్ సిటీ వద్దంటున్నారు..

బీఆర్ఎస్ వాళ్ల ఫ్యూచర్ ను ప్రజలు ఎప్పుడో రద్దు చేశారు..

ఫ్యూచర్ లేని వాళ్లు అంతా ఫ్యూచర్ గురించి మాట్లాడుతున్నారు..మళ్లీ సిద్ధిపేటలో గెలిస్తే కదా ఆయన.

మళ్లీ ఫార్మా కంపెనీలు ఇక్కడ పెట్టుకుందామా..?

సిరిస్ కంపెనీని వదిలించుకోవడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది..

ఫ్యూచర్ సిటీ వద్దంటున్నారు వస్తే చలాకీ కాల్చి వాతపెట్టాలి..

భారత్ ఫ్యూచర్ సిటీలో 15 వేల ఎకరాలను ఫారెస్ట్ ను అభివృద్ధి చేస్తున్నాం.. 60 శాతం



పచ్చదనం ఉంటుంది..

హైకోర్టు లో, ఎన్జీటీ ల్లో కేసులు వేస్తున్నారు అడ్డుకోవడానికి..

మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కోసం అమ్ముడుపోయిన ఆయన కూడా మాట్లాడుతున్నాడు..

మూసీ లో ఉన్న కాలుష్యం కంటే కల్వకుంట్ల వాళ్ల కడుపుల్లో ఎక్కువ కాలుష్యం ఉంది..

మూసీ కాలుష్యం వల్ల నల్గొండ జిల్లా ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారు..

మూసీ కాలుష్యం కారణంగా నల్గొండ జిల్లాలో పుట్టబోయే బిడ్డలు కాళ్లు వంకరపోతున్నాయని వలస పోతున్నారు..

నల్గొండ జిల్లా ప్రజలు విషంలోనే బతకాలా..?

మురికిలోనే ఉండాలని వాళ్లు అంటున్నారు..

మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం.. గండి పేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల లో అంతర్జాతీయ స్థాయిలో మూసీని అభివృద్ధి చేస్తాం.. చెరువులు, నాలాలు ఆక్రమిస్తే తొడ్కలు తీస్తాం..

గుర్రంగూడా ఎకో పార్క్ కు ఎన్ని నిధులైనా ఇస్తాం.. అభివృద్ధి చేసే బాధ్యత నాది..

ఎవరు ఏడ్చినా భారత్ ఫ్యూచర్ సిటీని కడతా..

అంతర్జాతీయ కంపెనీలను ఫ్యూచర్ సిటీకి తీసుకువస్తా...భవిష్యత్తు తరాలు భారత్ ఫ్యూచర్ సిటీని చర్చించునేలా నిర్మిస్తా..

## ఏపీలో ఆపరేషన్ ఆకర్ష్...

విజయవాడ, జూన్ 18, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలన మార్పులకు తెరలేవబోతోంది. ఎన్నికల్లో ఘనవిజయం సాధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఒక వ్యూహం ప్రకారం వాయిదా వేస్తూ వచ్చిన రాజకీయ చేరికల ప్రక్రియకు ఇప్పుడు గేట్లు ఎత్తడానికి ముహూర్తం ఖరారైనట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన కీలక నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూటమి బాట పట్టడానికి సిద్ధంగా ఉన్న తరుణంలో.. ఈ చేరికలను క్రమబద్ధీకరించడానికి కూటమి పార్టీలు ప్రత్యేక వ్యవస్థలను సిద్ధం చేసుకోవడం హాట్ టాపిక్గా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విచ్చలవిడిగా చేరికలను ప్రోత్సహించకుండా ఒక పద్ధతి ప్రకారం ఆలస్యం చేస్తూ వస్తున్నారు. ఎన్నికల ముగిసిన వెంటనే కొంతమందికి మాత్రమే ఎంట్రీ ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత చేరికలకు బ్రేకులు వేశారు. దీని వెనుక ప్రభుత్వ స్థిరత్వం, సొంత పార్టీల క్యాడర్లో అసంతృప్తి రాకుండా చూసుకోవాలనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల సుదీర్ఘ వ్యూహం ఉంది. అయితే, ప్రస్తుతం వైసిపిలో యాక్టివ్ గా లేని, ఇప్పటికే ఆ పార్టీకి రాజీనామా చేసి గోడ మీద పిల్లిలా ఉన్న సీనియర్ల సంఖ్య పెరిగిపోవడంతో, వారిని ఎక్కువ కాలం వెయిటింగ్లో ఉంచడం కంటే పార్టీల్లోకి ఆహ్వానించడమే శ్రేయస్కరమనే భావనకు కూటమి నేతలు వచ్చారు.చేరికలు ఒకరి పార్టీలోకి మరొకరు దూకడం వల్ల కూటమిలో అంతర్గత కలహాలు రాకుండా ఉండేందుకు ప్రత్యేక ఫిల్టరింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఇతర పార్టీల నుంచి వచ్చే నేతల స్క్రీనింగ్ కోసం, చేరికల ప్రక్రియను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక కమిటీని రంగంలోకి దించారు. తెలుగుదేశం పార్టీలో చేరికలను సమీక్షించడానికి, స్థానిక నేతల అభ్యంతరాలను పరిష్కరించడానికి ఎప్పటి నుంచో ఒక ప్రత్యేక విభాగం అంతర్గతంగా పనిచేస్తోంది. టీడీపీ-జనసేన-బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు లేదా క్షేత్రస్థాయి సమన్వయం దెబ్బతినకుండా, ఏ నేత ఏ పార్టీలో చేరితే సామాజికంగా, రాజకీయంగా లబ్ధి చేకూరుతుందో తేల్చేందుకు కూటమి తరఫున ఒక కో-ఆర్డినేషన్ కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది.ఇంతకాలం చేరికలపై వెనకడుగు వేయడానికి ప్రధాన కారణం స్థానికంగా ఉన్న లీడర్ల మధ్య టికెట్ల లొల్లి వస్తుందనే భయం. ఒక నియోజకవర్గంలో ఇప్పటికే కూటమి ఎమ్మెల్యే ఉన్నప్పుడు, వైసిపి నుంచి వచ్చే సీనియర్కు వచ్చే ఎన్నికల్లో సీటు ఎలా ఇస్తారు? అనే ప్రశ్న తలెత్తింది. అయితే, కేంద్ర ప్రభుత్వం త్వరలోనే డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టడం ఖాయమనే సంకేతాలు స్పష్టంగా రావడం ఇక్కడ గేమ్ ఛేంజర్గా మారింది. వచ్చే ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్లో అసెంబ్లీ స్థానాల సంఖ్య గణనీయంగా పెరుగుతుందనే భరోసా రావడంతో, కొత్తగా వచ్చే నేతలకు కూడా భవిష్యత్తులో సీట్లు సర్దుబాటు చేయవచ్చనే ధీమాతో కూటమి అగ్రనేతలు గేట్లు ఎత్తడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ విడత చేరికల్లో ఉత్తరాంధ్ర తో పాటు కోస్తా తీరం వెంబడి నెల్లూరు జిల్లా వరకు ఉన్న వైసిపికి చెందిన కనీసం 15 నుండి 20 మంది కీలక నేతలు క్యూ కట్టబోతున్నారు. రాయలసీమలోనూ పట్టున్న కొందరు రెడ్డి సామాజికవర్గ నేతలు కూడా కూటమితో టచ్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. వైసిపి అధినాయకత్వం వైఖరిపై నమ్మకం కోల్పోవడం, క్షేత్రస్థాయిలో క్యాడర్ మొత్తం కూటమి వైపు షిఫ్ట్ అయిపోవడంతో, తమ రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి వీరంతా లగేజ్ సర్దుకుంటున్నట్లుగా భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు అత్యంత కీలకం. గత ఎన్నికల ఫలితాలు నిరూపించింది ఏంటంటే.. టీడీపీ – జనసేన కలిసి ఉన్నంత కాలం వైసిపి గెలవడం అసాధ్యం. ఇదే విషయాన్ని వైసీపీ నేతలు కూడా చెబుతూ వస్తున్నారు. ఈ కూటమి కనీసం మరో రెండు దశాబ్దాల పాటు బలంగా కొనసాగుతుందనే నమ్మకం రాజకీయ నాయకుల్లో ఏర్పడింది. ఎప్పటికీ అధికారంలోకి రాలేని పార్టీలో ఉండి సమయం, డబ్బు వృధా చేసుకోవడం కంటే, పవర్ సెంటర్గా మారిన కూటమిలో భాగమవ్వడమే సరైన మార్గమని వైసిపి నేతలు భావిస్తున్నారు. ఈ చేరికల తుఫాను కేవలం వైసిపిని మరింత బలహీనపరచడానికే కాకుండా.. కూటమిలోని అంతర్గత బలాబలాలను మార్చడానికి కూడా ఉపయోగపడనుంది. పవన్ కల్యాణ్ ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా జనసేన గ్రాఫ్ మరింత పెరిగేలా బలమైన సామాజికవర్గ నేతలను ఆకర్షించే అవకాశం ఉంది, తద్వారా రాబోయే రోజుల్లో టీడీపీకి సమానంగా లేదా బలమైన ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే వ్యూహం ఇందులో కనిపిస్తోంది. మొత్తానికి, ఏపీలో రాబోయే కొన్ని వారాలు సరికొత్త రాజకీయ వలసలకు వేదిక కానున్నాయి.

### జనసేనలో జాయినింగ్ కమిటీ

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీని సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. తనకు బలమైన నాయకత్వం కావాలని ఆయన భావిస్తున్నారు. జనసేన ఇప్పటి వరకూ కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే బలంగా ఉంది. రాష్ట్రంలో అధిక శాతం జనసేన విస్తరించాలంటే అందుకు సరైన నాయకత్వం అవసరమని భావిస్తున్నారు. అందుకే పవన్ కల్యాణ్ తాజాగా కీలక నిర్ణయం నిర్ణయం తీసుకున్నారు.జనసేనలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీని ఏర్పాటు చేశారు. 14 మంది సభ్యులతో 'ఏపీ జనసేన కమిటీ' ఏర్పాటు చేశారు. త్వరలో ఏపీ తరహాలోనే తెలంగాణలో జాయినింగ్స్ కమిటీని ఏర్పాటు చేస్తామని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రకటించారు. అంటే చేరికలకు పవన్ కల్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లే కనిపిస్తుంది.అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, కిలారు రోశయ్య వంటి వారిని పార్టీలోకి తీసుకున్నారు వారంతా వైసీపీ నుంచి వచ్చిన వారే. నియోజకవర్గాల్లో బలమైన నేతలు. ఇక వైసీపీ నుంచి వచ్చే వారికి కూడా పవన్ కల్యాణ్ ఒకరకంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కనపడుతుంది. దీంతో రెండు లక్ష్యాలు నెరవేరుతాయని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. మొదటిది జనసేనకు బలమైన నాయకత్వం ఏర్పాటు కావడం. రెండోది వైసీపీని బలహీనపర్చడం. వైసీపీలో ఉన్న బలమైన నేతలు వస్తామంటే తీసుకునేందుకు పవన్ కల్యాన్ సిద్ధం అని ఈ నిర్ణయం తో స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇప్పటి వరకూ జనసేనలో చేరేందుకు కొందరు ప్రయత్నిస్తున్నా పవన్ కల్యాణ్ అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు.ఇందుకోసం పధ్నాలుగు మందితో ప్రత్యేకంగా కమిటీని నియమించడం వెనక కూడా పవన్ కల్యాణ్ ఒక వ్యూహం ప్రకారం ముందుకు వెళుతున్నారని అనిపిస్తుంది. ఎందుకంటే వైసీపీ, టీడీపీ, బీజేపీ ఏ పార్టీ నుంచి వచ్చినా చేర్చుకోవాలంటే ముందు ఈ కమిటీ ఒకే అంటేనే తర్వాత పవన్ కల్యాణ్ అనుమతి కోసం వెళ్లాల్సి ఉంటుంది. కమిటీ అన్ని రకాలుగా పరిశీలించి నేతల చేరికపై పవన్ కల్యాణ్ కు నివేదిక ఇచ్చిన తర్వాత మాత్రమే జనసేన పార్టీ కండువా కప్పుతారు. కోస్తాంధ్రతో పాటు రాయలసీమ నుంచి కూడా జనసేనలో పెద్దయెత్తున నేతలను అంటే నియోజకవర్గ స్థాయిలో బలమైన లీడర్లను చేర్చుకుంటే వచ్చే ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేసి బలమైన పార్టీగా అవతరించాలన్న వ్యూహంతోనే చేరికలకు పవన్ ఈ స్ట్రాటజీని అమలు చేస్తునట్లు అనిపిస్తుంది. మరి ఏ పార్టీ నుంచి చేరతారన్నది చూడాల్సిందే.

## కేడర్‌ను పట్టించుకోని నేతలు.. లోకేష్ సీరియస్ వార్నింగ్!

గుంటూరు జూన్ 18, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలనలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కేవలం ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ ఫేస్‌బుక్, ఎక్స్‌లలో పోస్టులు పెట్టినందుకే అర్ధరాత్రి వేళల్లో సీఐడీ, స్థానిక పోలీసులు ఇళ్లపై పడి అరెస్టులు చేసిన సంఘటనలు వందలాదిగా ఉన్నాయి. మరీ దారుణంగా, కేవలం రాజకీయంగా అణచివేయాలనే ఏకైక లక్ష్యంతో సోషల్ మీడియా ఐటీ చట్టాల కింద కాకుండా, జీవితాలను నాశనం చేసేలా గంజాయి రవాణా, రేప్ కేసులు, హత్యాయత్నం వంటి తీవ్రమైన నాన్-బెయిలబుల్ అక్రమ కేసులను టీడీపీ కేడర్‌పై అక్రమంగా బనాయించారు. దీంతో ఎంతోమంది యువకులు, పార్టీ సానుభూతిపరులు కోర్టుల చుట్టూ తిరుగుతూ తీవ్ర మానసిక, ఆర్థిక నష్టాన్ని చవిచూశారు.టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమపై ఉన్న అక్రమ కేసులు తక్షణమే రద్దవుతాయని వేలాది మంది కార్యకర్తలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం కూడా ప్రాథమికంగా బాధితుల వివరాలతో కూడిన లిస్టులను సేకరించింది. అయితే, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పగ్గాలు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇప్పటికీ అందరిపై కేసులు ఎత్తివేసే ప్రక్రియ పూర్తిస్థాయిలో కొలిక్కి రాలేదు. తాజాగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు, ఎమ్మెల్యేలతో జరిపిన అంతర్గత సమీక్షా సమావేశాలలో మాట్లాడిన మాటలను బట్టి క్షేత్రస్థాయిలో కేడర్ ఇప్పటికీ ఈ అక్రమ కేసుల వల్ల ఇబ్బందులు పడుతోందనే చేదు నిజం స్పష్టమయింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాల్లో కొంతమంది ఎమ్మెల్యేలు, కీలక నేతలు తమ సొంత పనుల్లో, అధికారిక హోదాల్లో బిజీ అయిపోయి.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమ కోసం లాఠీ దెబ్బలు తిని, జైలుపాలైన నిఖార్సైన కార్యకర్తలను విస్మరించారనే అసంతృప్తి పార్టీలో వ్యక్తమవుతోంది. ఈ క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్‌పై నారా లోకేష్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలను కాపాడుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, వెంటనే వారందరికీ న్యాయ సహాయం అందించి కేసుల నుంచి విముక్తి కల్పించే బాధ్యతను స్థానిక నేతలే తీసుకోవాలని ఆయన గట్టిగా హెచ్చరించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.ఇప్పటికైనా ప్రభుత్వం , టీడీపీ అధిష్టానం కేవలం సాధారణ ఆదేశాలకే పరిమితం కాకుండా, ఒక స్పెషల్ లీగల్ సెల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లు, కోర్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్త కేసుకు సంబంధించిన డేటాను క్రోడీకరించి, చట్టపరమైన లూప్‌హోల్స్‌ను తొలగిస్తూ హోంశాఖ ద్వారా జీవోలు జారీ చేసి కేసులను మాఫీ చేయించాలి. ఐదేళ్లపాటు సర్వస్వం కోల్పోయి పోరాడిన కేడర్‌తో నిరంతరం టచ్‌లో ఉంటూ, వారిపై ఉన్న అక్రమ కేసుల మరకలను త్వరితగతిన తుడిచివేసినప్పుడే.. భవిష్యత్తులో పార్టీ కోసం పని చేసే కార్యకర్తల్లో నమ్మకం, ధైర్యం నిలుస్తాయి.

## ఉత్తరాంధ్ర టూ ప్రకాశం.. విచిత్రమైన సైలెన్స్!

ఒంగోలు, జూన్ 18, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఓడిపోయిన సీనియర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల విచిత్రమైన మౌన వ్రతం ఇప్పుడు అటు పార్టీ కేడర్‌లోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ పెద్ద చర్చకు దారితీసింది. సాధారణంగా ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ప్రజా సమస్యలపై పోరాడుతూ లైమ్‌లైట్‌లో ఉండేందుకు నేతలు ప్రయత్నిస్తుంటారు. కానీ, వైసీపీకి చెందిన అత్యధిక శాతం మంది మాజీ ప్రజాప్రతినిధులు ప్రస్తుతం ఇటు అసెంబ్లీ వ్యవహారాలకు, అటు మీడియా ప్రెస్ మీట్లకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. కనీసం సొంత నియోజకవర్గాల్లో కేసులు, వేధింపులు ఎదుర్కొంటున్న కిందిస్థాయి కార్యకర్తలకు కూడా అందుబాటులో లేకుండా ఫోన్లు స్విచ్చాఫ్ చేసుకోవడం లేదా బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు షిఫ్ట్ అయిపోయారు. రెండేళ్లవుతున్నా మెరుపు తీగల్లా వచ్చి పోతున్నారు.ముఖ్యంగా ఉత్తరాంధ్ర , ప్రకాశం జిల్లాల పరిధిలోని కొందరు బడా మాజీ ఎమ్మెల్యేల ప్రవర్తన ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. గత ప్రభుత్వంలో మంత్రులుగా, జిల్లాలు ఏలిన కీలక నేతలుగా వెలిగిన వారు సైతం ఇప్పుడు నియోజకవర్గాల్లో గడప దాటడం లేదు. ప్రకాశం జిల్లాకు చెందిన ఒక సీనియర్ మాజీ కాకతాళీయంగా తన వ్యాపారాలన్నీ బెంగళూరుకు మార్చేసుకుని అక్కడే సెటిల్ అవ్వగా.. ఉత్తరాంధ్రకు చెందిన మరో ఇద్దరు కీలక నేతలు కనీసం స్థానిక పార్టీ ఆఫీసు వైపు కూడా చూడటం లేదు. ఐదేళ్ల పాటు హడావుడి చేసిన ఈ లీడర్లు హఠాత్తుగా ఇంతలా సైలెంట్ అయిపోవడం వెనుక కేవలం భయం మాత్రమే లేదు.. అంతకుమించిన పొలిటికల్ ప్లాన్ ఉందనే చర్చ నడుస్తోంది.పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తున్న అంతర్గత సమాచారం ప్రకారం.. ఈ మౌనం వెనుక అసలు కారణం కూటమి పార్టీల్లోకి జంప్ అయ్యేందుకు నడుస్తున్న గ్రౌండ్ వర్క్. గత హయాంలో తాము చేసిన కొన్ని వివాదాస్పద నిర్ణయాలు, ఆర్థిక లావాదేవీలపై ప్రస్తుత ప్రభుత్వం విచారణలు జరుపుతుండటంతో.. లీగల్ చిక్కుల నుండి ఎలాగైనా బయటపడాలని వీరు భావిస్తున్నారు. అందుకే, జగన్ రెడ్డి ఇచ్చే పిలుపులకు గానీ, తాడేపల్లి నుంచి వచ్చే ఆదేశాలకు గానీ స్పందించకుండా.. తాము వైకాపాకు దూరంగా ఉంటున్నామనే సంకేతాలను కూటమి పెద్దలకు పంపిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే లేదా సరైన రాజకీయ ముహూర్తం చూసుకుని అధికార పక్షంలో చేరిపోయేందుకు లోపాయికారీగా రాయబారాలు నడుపుతున్నట్లు తెలుస్తోందినాయకులు ఇలా బెంగళూరు రిసార్టులకో, విదేశీ పర్యటనలకో పరిమితమై 'సేఫ్ గేమ్' ఆడుతుండటంతో.. గ్రామాల్లోని వైకాపా సాధారణ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి లీడర్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. స్థానిక లొల్లీలు ఎదురైనప్పుడు కనీసం ఫోన్ చేసి ధైర్యం చెప్పే నాథుడే కరువవ్వడంతో.. కేడర్ అంతా ఒక్కొక్కరుగా కూటమి పార్టీల వైపు వెళ్లడమో లేదా రాజకీయాలకు దూరంగా ఉండటమో చేస్తున్నారు. లీడర్లేమో అటు అధినేత జగన్‌కు సమాధానం చెప్పలేక, ఇటు కేసులు భరించలేక కూటమి కండువా కప్పుకోవడానికి రూట్ క్లియర్ చేసుకుంటుంటే.. తమను నమ్ముకున్నందుకు పొలిటికల్ స్క్రీన్ పై తాము ఒంటరి వాళ్లమయ్యామని కిందిస్థాయి కార్యకర్తలు లోలోపల మధనపడుతున్నారు.

# వివాదాల సర్...

విజయవాడ, జూన్ 18, తెలుగు రాష్ట్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర ప్రక్షాళన చేస్తోంది. ఈనెల 15 నుంచి ఇంటింటా సర్వే ప్రారంభం అయింది. అయితే తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు భారత రాష్ట్ర సమితిలో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది . ఓట్ల తొలగింపు కోసం అధికారపక్షాలు అక్రమాలకు పాల్పడుతున్నాయంటూ ఆరోపణలు చేయడం మొదలుపెట్టారు. అయితే గతంలో ఆ రెండు పార్టీలు అధికారంలో ఉండేవి. అందుకే అంతలా కంగారు పడుతున్నాయి అనేది బహిరంగ రహస్యం. ఎందుకంటే ప్రతి గ్రామంలోనూ తమకు అనుకూలమైన ఓట్లు జాబితాలో ఉంచి.. తమకు ప్రతికూలమైన ఓట్లను తొలగించారు. అటువంటి ఓట్లు ఇప్పుడు తొలగిస్తారు అన్న భయం ఆ రెండు పార్టీలకు వెంటాడుతోంది. ఆ కారణంగానే ఆ రెండు పార్టీలు ఇప్పుడు గగ్గోలు పెడుతున్నాయి.ఈనెల 15 నుంచి ఇంటింటికి వెళ్తున్న బూత్ లెవెల్ అధికారులు సమగ్ర సర్వే చేపడుతున్నారు. అత్యంత పారదర్శకంగా, డిజిటల్ టెక్నాలజీ ఆధారంగా సాగుతోంది ఈ ప్రక్రియ. అర్హత ఉన్న ఈ ఓటరును కూడా తొలగించరు. కేవలం చనిపోయిన వారు, ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓటు ఉంటే అటువంటి వారిని తొలగిస్తున్నారు. డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను మాత్రమే నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత తొలగిస్తారు. ఇది సాధారణ, చట్టబద్ధమైన ప్రక్రియ కూడా. అయితే గతంలో బెంగాల్లో మమతా బెనర్జీ నానా హడావిడి చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో బంగ్లాదేశ్ చొరబాటుదారులు, అక్రమ ఓటరు గుర్తింపు పొందిన వారు లేనిపోని హడావిడి చేశారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు. అటువంటి చొరబాటుదారులకు ఛాన్స్ లేదు. అయితే గతంలో చాలా రకాల విన్యాసాలు చేశాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు భారత రాష్ట్ర సమితి. అందుకే ఇప్పుడు కంగారు పడిపోతున్నాయి.రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికారం చేపట్టాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, భారత రాష్ట్ర సమితి. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని వేలాదిగా దొంగ ఓట్లు చేర్పించారన్న విమర్శలు ఉన్నాయి. అటువంటి ఓట్లు ఇప్పుడు గల్లంతు కాక తప్పవు. ఈ డిజిటల్ స్ట్రాటజీలో అడ్డంగా బుక్ కావడం ఖాయం.

సర్వే ప్రక్రియపై పౌరులు, పార్టీలు అప్రమత్తంగా ఉండి తమ ఓట్లను వెరిఫై చేసుకోవడంలో ఎలాంటి తప్పులేదు. కానీ అసలు ఓట్లు పూర్తిగా తొలగించేస్తున్నారంటూ గగ్గోలు పెట్టడం వెనుక మాత్రం వారి భయం వారికి ఉంది. కేవలం ఎన్నికల సంఘం మార్గదర్శకాలను మాత్రమే బూత్ లెవెల్ అధికారులు అమలు చేస్తారు. దీనిని ఎప్పటికప్పుడు పరిశీలించి తప్పులు జరిగితే అడ్డుకోవచ్చు. కానీ రెండు తెలుగు పార్టీలు మాత్రం ఇప్పటినుంచే ఓటమికి కారణాలు వెతుకుతున్నట్టు స్పష్టమవుతోంది.

## యూపీలో ఎన్డీయే సరికొత్త వ్యూహాలు

లక్నో, జూన్ 18 (న్యూస్ పల్స్)ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో సమాజ్ వాదీ పార్టీ ని లక్ష్యంగా చేసుకుని అధికార ఎన్డీయే కూటమి సరికొత్త వ్యూహాలకు తెరలేపింది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పార్టీల ఎంపీలు చీలిపోయి ఎన్డీఏకు మద్దతు ప్రకటించడంతో యూపీలోనూ అదే తరహా రాజకీయాలు జరుగుతాయన్న చర్చ ప్రారంభమయింది. యోగి ఆదిత్యనాథ్ క్యాబినెట్‌లో మంత్రి, సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ అధినేత ఓం ప్రకాష్ రాజ్‌భర్ చేసిన సంచలన వ్యాఖ్యలు యూపీ రాజకీయాల్లో పెను తుఫానును సృష్టించాయి. సమాజ్ వాదీ పార్టీకి చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ ఎంపీలు బీజేపీ వైపు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే ఎస్పీలో భారీ చీలిక రాబోతోందని ఆయన ప్రకటించారు.యూపీ మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ తన సోషల్ మీడియా వేదికగా ఎస్పీ అగ్రనేత రామ్ గోపాల్ యాదవ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఒక రహస్య లేఖ సమర్పించారని ఆరోపించారు. యూపీని గతంలో కుదిపేసిన మైనింగ్ కుంభకోణం, గోమతి రివర్ ఫ్రంట్ స్కామ్‌ల మాస్టర్‌మైండ్ ఎవరో అందరికీ తెలుసని.. ఇప్పుడు ఆ కేసుల ఉచ్చు గట్టిగా బిగుస్తుండటంతో ఎస్పీ నేతల్లో ఆందోళన మొదలైందని ఆయన పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థల భయంతో , నియోజకవర్గాల నిధుల కోసమే స మొత్తం సమాజ్ వాదీ పార్టీ బీజేపీలో చేరేందుకు లోపాయకారీగా లైన్ క్లియర్ చేసుకుంటోందని, అందులో భాగంగానే 21 మందికి పైగా ఎంపీలు టచ్‌లోకి వచ్చారని రాజ్‌భర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.మంత్రి రాజ్‌భర్ చేసిన ఈ మైండ్ గేమ్‌పై సమాజ్ వాదీ పార్టీ అధినేత, లోక్‌సభ ఎంపీ అఖిలేష్ యాదవ్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇవన్నీ కేవలం ఓటమి భయంతో బీజేపీ ఆడుతున్న చౌకబారు నాటకాలని కొట్టిపారేశారు. లోక్‌సభ ఎన్నికల్లో యూపీ ప్రజలు బీజేపీకి గట్టి బుద్ధి చెప్పారని, ఆ పరాజయాన్ని జీర్ణించుకోలేక ఇటువంటి మైండ్ గేమ్స్ ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం లోక్‌సభలో 37 స్థానాలతో మూడో అతిపెద్ద పార్టీగా అవతరించిన తమ పార్టీ ఎంతో పటిష్టంగా ఉందని, తమ పార్టీ ఎంపీలు ఎవరూ కూడా ప్రలోభాలకు లొంగే ప్రసక్తే లేదని అఖిలేష్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చీలిక వస్తుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని అఖిలేష్ తిప్పికొడుతూ.. రాబోయే 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీతో కలిసి ఉమ్మడిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఏ విధంగానైతే మట్టికరిపించామో, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే ఫార్ములాతో యోగి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని పునరుద్ఘాటించారు. ప్రతిపక్షాల మధ్య విభేదాలు సృష్టించి మైలేజ్ పొందాలని చూస్తున్న బీజేపీ పప్పులు ఉమ్మడి యూపీలో ఉడకవని, అసలైన ప్రజా సమస్యలైన నిరుద్యోగం, ఆరోగ్య రంగా పతనంపై మాట్లాడకుండా అధికార పక్షం ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో శివసేన కి చెందిన ఎంపీలు షిండే వర్గంలో విలీనం అయ్యారు. రాజ్‌భర్ చేసిన ఈ వ్యాఖ్యలు యూపీ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. లోక్‌సభలో మేజిక్ ఫిగర్ దాటినప్పటికీ, విపక్షాల బలాన్ని మరింత కుంగదీయాలనే వ్యూహంతో బీజేపీ ఆపరేషన్ లోటస్ ను దేశవ్యాప్తంగా విస్తరిస్తోందనే అనుమానాలు బలపడుతున్నాయి. అయితే, అఖిలేష్ యాదవ్ తన ఎంపీలు, కేడర్‌ను కాపాడుకుంటూ 2027 పోరుకు ఎలా సిద్ధం కాబోతున్నారనేది రాబోయే రోజుల్లో జాతీయ రాజకీయాల సరళిని శాసించనుంది

## హార్మూజ్ జలసంధి తెరుచుకుంది...

న్యూఢిల్లీ జూన్ 18 మిడిలీస్ట్‌ను కుదిపేసిన ఇరాన్–అమెరికా యుద్ధానికి ముగింపు దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ యుద్ధ విరమణకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసినట్లు వైట్ హౌస్ ప్రకటించింది. ఈ ఒప్పందంతో ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోనుంది. అయితే ఒప్పందాన్ని ఇజ్రాయెల్ పూర్తిగా అమలు చేస్తుందా లేదా అన్నదానిపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది.ఈ ఒప్పందం తర్వాత ఇరాన్ ఒక ప్రకటన చేసింది. శాంతి ఒప్పందంపై చర్చలు పూర్తయ్యాని పేర్కొంది. ఒప్పంద అములుకు ఇది పరీక్ష సమయం అని తెలిపింది. అయితే ఈ రెండు దేశాల మధ్య దాదాపు 14 అంశాలపై రాజీ కుదిరినట్లు తెలుస్తోంది. ఈ 14 అంశాలకు ఏవి అని కూడా తాజాగా అమెరికా ప్రకటించింది. లెబనాన్‌తో పాటు అన్ని వైపులా సైనిక చర్యల నిలిపివేతకు అమెరికా అంగీకరించింది.ఇరాన్–అమెరికా తుది ఒప్పందానికి 60 రోజుల గడువు ఉంటుంది. పరస్పర అంగీకారంతో ఇరు దేశాలు ఈ గడువును పెంచుకోవచ్చు.30 రోజుల్లో హర్మూజ్ దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేసి, టోల్ లేకుండా ఇరాన్ నౌకలను అనుమతించాలి.. ఇరాన్ పునర్నిర్మాణ కోసం 300 బిలియన్ డాలర్ల నిధి ఏర్పాటు చేస్తారు. అణ్వాయుధాన్ని ఎప్పటికీ తయారు చేయకూడదని ఇరాన్ అంగీకరించింది. అలాగే ఆంక్షలు ఎత్తివేసే వరకు స్వేచ్ఛగా చమురు అమ్ముకునేందుకు అంగీకరించాలని ఇరాన్ కోరింది. అయితే ఈ మొత్తం 14 అంశాల్లో యురేనియం సంబంధించి ఎక్కడా ప్రస్తావన జరగలేనట్టు కనిపిస్తోంది.

### గులాబీ ఓవర్ కాన్ఫిడెన్సేనా...

హైదరాబాద్ జూన్ 18, తెలంగాణలో బీఆర్ఎస్ తన ఓట్ల శాతాన్ని కాపాడుకునే ప్రయత్నం మొదలు పెట్టింది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం కంటే పెంచుకునేందుకు అవసరమైన వ్యూహాలను రచిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు తమకు అనకూల ఓటు పెరుగుతుందని గులాబీ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా బీఆర్ఎస్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో బలంగా ఉంది. మరొకవైపు బీజేపీ బలపడుతుంది. బీజేపీ తమ ఓటు బ్యాంకును చీల్చకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే కాంగ్రెస్ పై వ్యతిరేక ఓటును తాము రాబట్టుకునే ప్రయత్నంలో కారు పార్టీ ఉంది. పార్టీ అగ్రనేత కేసీఆర్ సూచనల మేరకు కీలక నేతలు ఇప్పటికే ఆ పనిలో నిమగ్నమయ్యారు.సహజంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఖచ్చితంగా అంతో ఇంతో వ్యతిరేకత ఉంటుంది. పాజటివిటీ కంటే నెగిటివిటీ ఓటు ఎక్కువగా ఉంటుంది. అందుకు కాంగ్రెస్ కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే గతంలో బీఆర్ఎస్ రెండు దఫాల తర్వాత వచ్చిన వ్యతిరేకతతోనే కాంగ్రెస్ మొన్నటి ఎన్నికల్లో విజయం సాధించింది. అయితే ఎప్పుడూ పదేళ్లు ఒకే పార్టీ ఉంటుందని అనుకోవడం కేవలం గణాంకాల కోసమే. ప్రాక్టికల్ గా కుదరదు. మరొకవైపు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు బీజేపీ నుంచి కూడా ప్రమాదం పొంచి ఉంది. బీజేపీ ఎంత బలపడితే అంత కాంగ్రెస్ కే నష్టమన్న అంచనాలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎటు వెళుతుందన్నది పక్కన పెడితే మూడు పార్టీలు బలంగా ఓట్లు చీల్చుకుంటే అది తమకే లాభమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. తమకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో వస్తున్న మద్దతు అందుకు ఉదాహరణ అని చెబుతున్నారు. ప్రస్తుతానికి కేటీఆర్, హరీశ్ రావులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇటు క్యాడర్ తో పాటు ఓటు బ్యాంకును కూడా రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో తమ పాలనకు, ప్రస్తుత పాలనకు బేరీజు వేసుకుంటే తామే ఎక్కువ ఓట్లు సాధిస్తామని గులాబీ పార్టీ నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లోనూ అనేక నియోజకవర్గాల్లో స్వల్ప మెజారిటీతో ఓటమి పాలయిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ ఈసారి ఎన్నికల్లో తమకు అధికారం గ్యారంటీ అన్న ధీమాతో ఉంది. మరి చివరకు ఓటర్లు ఎలా తీర్పు చెబుతారన్నది చూడాల్సి ఉంది.

# 200 జిల్లాల్లో నీటి కటకట

న్యూఢిల్లీ జూన్ 18 మొన్నటికి మొన్న దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించాయని.. అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయని.. ఎల్ నీనో ప్రభావం అంతగా ఉండదని మీడియాలో వార్తలు వచ్చాయి.. కానీ ఈ మురిపం రెండు మూడు రోజులకే పరిమితమైంది. ఎందుకంటే రుతుపవనాల విస్తరణకు అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో దేశవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల మినహా మిగతా అన్నిచోట్ల ఎండలు దంచి కొడుతున్నాయి. వర్షపాతం ఏకంగా 36% లోటుకు చేరుకుంది. జూన్ నెలలో వర్షపాతం 36% లోటు పెద్ద ఇబ్బంది కాకపోయినప్పటికీ.. రుతుపవనాల విస్తరణకు ఏమాత్రం అనుకూల వాతావరణ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.జూన్ 16 నాటికి దేశవ్యాప్తంగా వర్షపాతం లోటు ఏకంగా 35 శాతానికి చేరుకుంది. మహారాష్ట్ర.. కొంకన్ తీరంలో ఇంతవరకు నైరుతీ రుతుపవనాలు విస్తరించలేదు. ఈ ప్రాంతంలో అనుకూలమైన వాతావరణం ఏర్పడి వర్షాలు కురిస్తేనే గోదావరి నదికి వరద వస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు ఆ వరదే జీవనాధారం. పొడి వాతావరణం వల్ల కొన్ని రోజులుగా ఉత్తర దిశగా రుతుపవనాల విస్తరణ పూర్తిగా ఆగిపోయింది.. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాది ఈ సమయానికి వాయవ్య భారతదేశం మాత్రమే సాధారణ వర్షపాతం కంటే ఒక ఐదు శాతం ఎక్కువగా పొందింది. తూర్పు, ఈశాన్యం, మధ్య భారతదేశం, దక్షిణ దీపకల్పంలో లోటు వర్షపాతం కొనసాగుతోంది. ఈశాన్య భారతదేశంలో 43%.. మధ్య భారత దేశంలో 63%.. దక్షిణ ద్వీపకల్పంలో 14 శాతం లోటు వర్షపాతం కొనసాగుతోంది. 2000 నుంచి ఎల్ నీనో సంవత్సరాలను ఒకసారి పరిశీలిస్తే.. జూన్ వర్షపాత వ్యత్యాసాల విశ్లేషణలో 2015 జూన్ నెల నిలిచింది. ఆ సంవత్సరం జూన్ నెలలో సాధారణ కంటే ఎక్కువ వర్షపాతం 14% అధికంగా నమోదయింది. 2002 జూన్.. 2024 జూన్ నెలలో వర్షపాతం సాధారణ స్థాయిగా నమోదయింది.. అనంతరం జూలై నుంచి మిగతా నెలలో వర్షపాతం తక్కువగా నమోదయింది. 2009లో జూన్ నెలలో సాధారణం కంటే 47% తక్కువగా వర్షపాతం నమోదయింది. 2014లో సాధారణం కంటే 44 శాతం తక్కువగా వర్షపాతం నమోదయింది. 2023లో సాధారణం కంటే ఎనిమిది శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రం కాలానుగుణంగా వేడిగా మారడం వల్ల అది భారత దేశంలో రుతు పవనాల గమనాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ఎల్ నీనో సాధారణంగా రుతుపవనాల ప్రారంభం.. రుతుపవనాల ముగింపు పై తీవ్రమైన ప్రభావం చూపిస్తోందని.. అందువల్లే ఈ స్థాయిలో వర్షపాతం తక్కువగా నమోదు అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది కాస్త ఆలస్యంగా జూన్ 4న కేరళలో వృత్తిపవనాలు ప్రవేశించాయి. అయితే అప్పటికే పశ్చిమ తీరం వెంబడి రుతుపవనాల పురోగతి వేగాన్ని కోల్పోయింది. వాతావరణంలో మార్పుల ఆధారంగా రుతుపవనాలు విడతలవారీగా కదులుతూ ఉంటాయి. ముంబై శివారు ప్రాంతానికి చేరుకున్న మొదటి విడత రుతుపవనాలు స్థిరంగా నిలబడలేకపోయాయి. దీనికి బదులుగా ముంబై నగరానికి ఉత్తరాన ప్రతికూల వాతావరణం వల్ల రుతుపవనాలు స్తంభించిపోయాయి.. ఒకవేళ వర్షాలు కురవాలి అంటే కచ్చితంగా బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడాలి.. అప్పుడుగాని ఎల్ నీనో ప్రభావం తగ్గుతుంది.ఇప్పటి అంచనాల ప్రకారం దేశంలో దాదాపు 20 జిల్లాలు డేంజర్ జోన్ లో ఉన్నాయి. ఇక్కడ ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలని.. తక్కువ నీటి అవసరం ఉన్న పంటలు మాత్రమే రైతులు వేసేలా అవగాహన కల్పించాలని కేంద్రం సూచించింది.. ఒకవేళ కరువు వల్ల పంటలు పండకపోతే రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే చైనా ఎరువుల తయారీకి సంబంధించిన ముడి పదార్థాలపై ఆంక్షలు విధించింది. దీంతో దేశీయంగా యూరియా ఉత్పత్తి వ్యయం కూడా పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## పీఓకేలో గో బ్యాక్ పాక్

న్యూఢిల్లీ జూన్ 18 పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్.. దీన్ని ఆక్రమించిన పాకిస్తాన్ .. దీన్ని 'అజాద్ కశ్మీర్'గా పిలుస్తారు. అక్టోబర్ 24, 1947లో ఏర్పడింది. గిల్గిట్ బాల్టిస్టాన్, అజాద్ కశ్మీర్ ను పాక్ ఆక్రమించింది. ఇది 77 ఏళ్లుగా పాకిస్తాన్ కాలనీగా ఉంది. పేరుకు స్వతంత్ర ప్రాంతం.. కానీ పాకిస్తాన్ పాలనలోనే మగ్గింది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. వారు భారత్ లో జమ్మూకశ్మీర్ ఎలా మారుతుందో చూస్తున్నారు. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు తర్వాత పరిస్థితులు కశ్మీర్ లో పరిస్థితులు మారాయి. ఐఐటీలు, ఐఐఎంలు లాంటి 10 అత్యున్నత సంస్థలు వచ్చాయి. రోడ్లు, మౌళిక వసతులు, బాగా వచ్చాయి. భారత్ ఏమో శత్రుదేశంగా చూస్తే కశ్మీరీలకు భారత్ వల్లే మేలు జరిగింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ మాత్రం అక్కడ నష్టం జరిగిందని ఇతర దేశాల్లో ఉన్న కశ్మీరీలు గ్రహించి ఇప్పుడు పీఓకే లో ఆందోళనలు చేపడుతున్నారు.ఒకనాడు కేవలం ఆర్థిక డిమాండ్ల వరకే ఉన్నాయి. గత 10 రోజుల ఆందోళనలో ఈరోజు రాజకీయ డిమాండ్ గా మారింది. మా కశ్మీర్ లో మీరు ఎవరు అంటూ పాక్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. మీ పాక్ సైన్యం ఇక్కడ ఎందుకు అంటూ నినదిస్తున్నారు.పాక్ ఆర్మీ, పాక్ అధికారులు వెళ్లిపోవాలని నినాదాలు చేస్తున్నాడు. ఆడవారు, వేలాది మంది పబ్లిక్ ర్యాలీలు తీస్తున్నారు. మా దేశం వేరు.. మీది వేరు అంటూ మాట్లాడడం మొదలుపెట్టారు. ఉగ్రవాదానికి ఊతం ఇచ్చి పెంచి పోషించిందే పాక్ ఆక్రమిత కశ్మీర్. కానీ ఇవ్వాల హిందుస్తాన్ తో అయినా కలుస్తాం అని అంటున్నారు.

## మహిళ వేషంతో గాలం వేసిన పురుష పుంగవుడు

తిరుపతి, జూన్ 18 పొత్తూరి మోహన కృష్ణమ నాయుడు. వయస్సు 30 ఏళ్ళు. మదనపల్లిలోని శివాజీ నగర్ లో నివాసం. ఇంటర్ దాకా చదివిన మోహన కృష్ణమ నాయుడు ఆడవేషం ధరించి అందాలు ఆరబోయడంలో దిట్ట. చీర కట్టులోనే కాదు మోడరన్ డ్రెస్సుల్లోనూ మగాళ్ళను ఆకర్షిస్తూ స్త్రీ వేషధారణలో తిరుగుతూ మోసాలకు పాల్పడటమే వృత్తి. మధుశ్రీ అలియాస్ హనీగా హనీ ట్రాప్ చేస్తున్న మోహన కృష్ణమ నాయుడు నమ్మించి మోసం చేసిన వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. మహిళగా వేషం మార్చి మోసాలు చేయడమే కాదు నమ్మే వాళ్ళ ఇళ్లను గుల్ల చేయడంలోనూ దిట్టగా మధు శ్రీ అలియాస్ హనీ నేరాలకు పాల్పడుతూ వచ్చింది. గుప్త నిధులు ఉన్నాయని, ప్రేతాత్మలు ఉన్నాయని భయపెట్టి మోసం చేయడంలో మధుశ్రీ అలియాస్ హనీ రాణించింది.శాంతి పూజలు చేయాలంటూ నమ్మించి మోసాలకు పాల్పడటమే కాకుండా పెళ్లిళ్ల పేరిట లేడీ గెటప్ లో పలువురికి వలపు వేసి పెళ్లి చేసుకుని మోసాలకు పాల్పడింది. కొందరు యువకులను ట్రాప్ చేసి జీవితం బాగుండాలంటే తనలాంటి ఆడ మగ కాని వాళ్ళను పెళ్లి చేసుకోవాలని మాయమాటలు చెప్పి అయిన కాడికి దండుకున్న మోహన కృష్ణ నాయుడు మధుశ్రీ గా మారి మోసాలకు పాల్పడింది. యువకులను ఆకర్షించి కొందరి చేత తాళి కూడా కట్టించుకున్న మధు శ్రీ అలియాస్ హనీ మాయ లేడిగా చలామణి అయింది.

గత కొంతకాలంగా ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న మాయలేడి బాధితులు ఇప్పుడు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. మదనపల్లి లోనే పదుల సంఖ్యలో బాధితులు ఉండగా పక్క రాష్ట్రం కర్ణాటకలోనూ మధు శ్రీ అలియాస్ హనీగా మారిన మోహన కృష్ణమ నాయుడిని మోహించిన వారి సంఖ్య నివ్వెర పరుస్తుంది.

కొందరు బాధితులు పోలీసులను ఆశ్రయించగా ఈ యవ్వారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఇక పడుచు పిల్లగా సింగారించు కోవడమే కాకుండా పెళ్లిళ్లు జరిగే చోట్లకు వెళ్లి దిష్టి తీస్తూ పలువురి దగ్గర అందిన కాడికి దోచుకోవడం లోనూ పొత్తూరి మోహన్ కృష్ణమ నాయుడు ఏ హనీ రాణించింది. మధుశ్రీగా హనీ గా పోలీసులు, రాజకీయ నాయకులకు బాగా తెలిసిన మోహన కృష్ణమ నాయుడు వారితోనూ సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

గత కొద్ది రోజులుగా పలు ఫిర్యాదులు వచ్చినప్పటికీ పోలీసుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. తనను మోహించిన వారిని మోసం చేయడమే కాకుండా గుప్తనిధులున్నాయని, తాంత్రిక పూజలు పేరుతోనూ కొందరికి ట్రాప్ చేసిన మధు శ్రీ అలియాస్ హనీ పై ఇప్పటివరకు ఒక్క కేసు నమోదు కాకపోవడం చర్చగా మారింది. కొందరు పోలీసు అధికారుల అండదండలు ఉండడంతోనే మాయలేడి అవతారంలో మాయల మరాఠీగా మోహనకృష్ణమనాయుడు రాణిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఈ వ్యవహారంపై పోలీసు యంత్రాంగం స్పందించక పోవడం చర్చణీయాంశంగా మారింది.

## ఎస్సీ బాలికల హాస్టల్ లో నీటి పైపుకు లీకేజీ

కళ్యాణదుర్గం కేంద్రంలోని దొడగట్ట రోడ్ లోని ఎస్సీ బాలికల హాస్టల్. ఈ హాస్టల్ ప్రాంగణంలో సత్యసాయి నీటి సరఫరా పైప్ లైన్ కు లీకేజీ పడింది. పదిరోజులుగా నీటి ప్రవాహం కొనసాగుతుంది. సెలవుల అనంతరం హాస్టల్ కి విద్యార్థినులు వచ్చేశారు. ఈ నీటి ప్రవాహం లోనే విద్యార్థులు నడవాల్సివస్తుంది. నీటి నిల్వ కారణంగా దోమలు ఎక్కువవుతున్నాయి. ఆన్పైప్ లైన్లు మరమ్మతులు చేసినా ఫ్రెజర్ కారణంగా పూర్తి స్థాయిలో ఆగిపోలేదని హాస్టల్ వార్డెన్ అంటున్నారు. సత్యసాయి నీటి సరఫరా ఇంజనీర్లు చొరవ తీసుకొని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇక్కడి పరిసర ప్రాంతం లోని నివాస గృహాల వారు హాస్టల్ బయట ప్రధాన ద్వారం ముందరే చెత్త కుప్ప వేస్తున్నారు. దీని మూలంగా విద్యార్థులు అనారోగ్యం బారినపడే అవకాశం ఉంది. మున్సిపాలిటీ అధికారులు చొరవ తీసుకుని చెత్త కుండీ మరో చోటకు మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# నేతలు మించిపోతున్న అవినీతి అనకొండలు

హైదరాబాద్, జూన్ 18, తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ వరుసగా జరుపుతున్న మెగా దాడులు, అందులో దొరుకుతున్న అక్రమ ఆస్తుల వివరాలు చూసి సామాన్య పౌరుల మైండ్ బ్లాంక్ అవుతోంది. ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి నివాసాలపై జరిగిన దాడుల్లో మంచాల కింద లభించిన కోట్లాది రూపాయల నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం, లగ్జరీ ఫ్లాట్ల డాక్యుమెంట్లు ఒక ఎత్తయితే.. అంతకు వారం ముందే రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ మోహన్ నాయక్ నివాసాల్లో రూ. 200 కోట్ల మార్కెట్ విలువైన అక్రమ ఆస్తులు బయటపడటం మరో ఎత్తు. మే నెలలోనే మెద్చల్ డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ ఇళ్లపై జరిగిన దాడుల్లోనూ వంద కోట్ల విలువైన ల్యాండ్ల పత్రాలు దొరికాయి. ఇవన్నీ చూస్తుంటే తెలంగాణలో అవినీతి అనేది ఏదో ఒకరిద్దరు అధికారులకో, ఒక శాఖకో పరిమితం కాలేదని.. వ్యవస్థల్లో ఏ స్థాయిలో వేళ్లనురుకుపోయిందో స్పష్టమవుతోంది.రాష్ట్రంలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, టౌన్ ప్లానింగ్, మైనింగ్, ఎక్సైజ్, గృహ నిర్మాణ శాఖల్లో కింది స్థాయి క్లర్క్ నుండి పైస్థాయి డైరెక్టర్ల వరకు ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్ లాగా అవినీతి సాగుతోందని మీడియా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. జీతం కొన్ని వేలలో ఉండే అధికారుల ఇళ్లలో వందల కోట్ల మార్కెట్ విలువైన బినామీ ఆస్తులు, ఓపెన్ ప్లాట్లు, ఫార్మ్‌హౌస్‌లు బయటపడటం దేనికి సంకేతం? ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు హెచ్చరిస్తున్నా క్షేత్రస్థాయిలో లంచాల పర్వం ఆగకపోగా.. అవినీతి తిమింగలాల ఆస్తుల వేగం మాత్రం జెట్ స్పీడ్ తో దూసుకుపోతోంది. ఏసీబీ కేవలం పక్కా సమాచారం ఉన్న కొద్దిమందిపైనే దాడులు చేస్తుంటేనే ఈ స్థాయి సంపద కుప్పలుగా తేలుతోంది.రాష్ట్రంలో ఒకరిద్దరు అధికారులను కాకుండా.. కీలక శాఖల్లో ఉన్న క్లాస్-1, క్లాస్-2 గ్రేడ్ అధికారులందరిపై ఆపరేషన్ క్లీన్-అప్ తరహాలో ఏకకాలంలో రాష్ట్రవ్యాప్త తనిఖీలు నిర్వహిస్తే ఎలా ఉంటుంది? అనుమానితులైన ప్రతి ఉన్నతాధికారి సంపాదనను, వారి బినామీల నెట్‌వర్క్‌ను జల్లెడ పట్టి ఆస్తులన్నీ లెక్కతేల్చి, వాటిని గనుక ప్రభుత్వం జప్తు చేస్తే.. అక్షరాలా తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ కు సమానమైన నిధులు ఒకే ఏడాదిలో సమకూరడం ఖాయమని లెక్కలు వేస్తున్నారు. అంతలా ప్రజాధనం అక్రమార్కుల లాకర్లలో మూలుగుతోంది.ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం నిధుల కొరతతో, ప్రాజెక్టుల రుణాల బదిలీల కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతుంటే.. మరోవైపు రాష్ట్రంలోనే కొంతమంది అధికారులు సమాంతర ఆర్థిక వ్యవస్థను నడుపుతున్నారు. ఈ డిజిటల్ యుగంలో బినామీల పేరిట స్థిరాస్తులు కొనడం, హవాలా మార్గాల్లో పెట్టుబడులు పెట్టడం పెరిగిపోయింది. ప్రభుత్వం కేవలం సంప్రదాయ ఏసీబీ దాడులకే పరిమితం కాకుండా.. ఆధునిక టెక్నాలజీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ , ఐటీ శాఖల సమన్వయంతో వ్యవస్థాగత శస్త్రచికిత్స చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ అవినీతి తిమింగలాల గొంతు నొక్కి, అక్రమ ఆస్తులను ప్రజా సంక్షేమానికి మళ్లిస్తేనే.. తెలంగాణ సమాజానికి అసలైన ఆర్థిక స్వాతంత్రం లభిస్తుందని అనుకోవచ్చు.

రెండు సంవత్సరాలు.. 441 కేసులు..

కేవలం రెండు సంవత్సరాలు.. 441 కేసులు.. ఇదేదో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ లో నమోదు చేసిన కేసులు కాదు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నమోదు చేసిన కేసులు కాదు. తెలంగాణలో ఏసీబీ ఆఫీసర్లు కరప్షన్ కు పాల్పడుతున్న అధికారుల మీద నమోదు చేసిన కేసులు. పైగా వీరిలో చాలామంది లంచం తీసుకుంటూ దొరికిపోయారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు లంచం తీసుకుంటే ట్రాప్ చేస్తున్నారు. అక్రమంగా ఆస్తులను కూడ పెడితే రైడ్ చేస్తున్నారు. 2024 నుంచి ఇప్పటివరకు ఏకంగా 441 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ఇంత స్థాయిలో కేసులు నమోదు చేస్తున్నప్పటికీ అవినీతి అధికారులు తమ ధోరణి మార్చుకోవడం లేదు. ఇటీవల కాలంలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న రాము నాయక్ అనే అధికారిని ప్రభుత్వం డిస్మిస్ చేసింది. అతడు ఏకంగా ప్రభుత్వ భూములను ఇతర వ్యక్తులకు అక్రమంగా పట్టా చేయించాడు. దీనికోసం భారీగా లంచం తీసుకున్నాడు. ఇటీవల మోహన్ నాయక్ అనే అధికారి 100 కోట్లకు పైగా ఆస్తులను కూడబెట్టిన నేపథ్యంలో.. అతని మీద కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అవినీతి అధికారుల మీద ఏసీబీ అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ వారి ప్రవర్తన మారడం లేదు. ఇటీవల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలంలో ఒక ఎంపీడీవో, ఎంపీవో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పకడ్బందీగా పట్టుకున్నారు. పైగా ఆ మహిళా అధికారి తన కుమారుడిని కూడా వసూళ్లకు ప్రత్యేకంగా నియమించుకోవడం విశేషం. ఏసీబీ అధికారుల తనిఖీలు ఆ ఎంపీడీవో, ఎంపీవో పట్టుబడిన నేపథ్యంలో.. అక్కడి ప్రజలు పటాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.అవినీతి అధికారులు రోజురోజుకు ప్రజల మీద పడి దోచుకుంటున్నారు. ఏదైనా పని ఉందని వెళ్తే.. మొహమాటం లేకుండా ఏమిస్తావని అడుగుతున్నారు. తాజాగా ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. అతడికి ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని అధికారులు గుర్తించారు. పాతబస్తీలోని ఛత్రినాక ప్రాంతంలో అతడి నివాసం.. కార్యాలయం.. బంధువుల గృహాలలో తనిఖీలు చేపట్టారు. నరహరి ఇంట్లో ఏకంగా 1.10 కోట్ల నగదును గుర్తించారు. ఇవే కాక బంగారు ఆభరణాలు.. ఇతర రికార్డులను కూడా స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాలలో అతడికి ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి ఉంది. బహిరంగ మార్కెట్లో వీటి విలువ వందల కోట్లు ఉంటుందని తెలుస్తోంది. ఇటీవల కాలంలో పెద్దపెద్ద ఆఫీసర్లను ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి పట్టుకుంటున్నప్పటికీ. అవినీతి అధికారులు తమ ధోరణి మార్చుకోవడం లేదు.

## బొమ్మకల్ పంచాయతీ వినూత్న తీర్మానం

### ప్రభుత్వ స్కూల్లో పిల్లలను చేర్పిస్తే ఇంటి పన్ను నల్లా బిల్లు పూర్తిగా మాఫీ

కరీంనగర్, జూన్ 18, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, వాటిని బలోపేతం చేసేందుకు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీ ఒక వినూత్న నిర్ణయం తీసుకుంది. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక లేదా ఉన్నత పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు ఇంటి పన్ను, నల్లా బిల్లుల నుంచి పూర్తి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది. సర్పంచ్ వేముల శ్రీకాంత్ నేతృత్వంలోని పాలకవర్గం ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ ఆఫర్ ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం ముగిసే వరకు వర్తిస్తుందని స్పష్టం చేసింది.ప్రభుత్వ పాఠశాలల మనుగడను కాపాడుకునేందుకు, ప్రైవేటు పాఠశాలల మోజులో పడి సర్కారు బడులను నిర్లక్ష్యం చేస్తున్న తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు ఒక గ్రామ పంచాయతీ దేశంలోనే ఎక్కడా లేని విధంగా విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే ఏకైక లక్ష్యంగా ఒక అద్భుతమైన ఆఫర్ ప్రకటించింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు, ఆయా ఇళ్లకు సంబంధించిన వార్షిక ఇంటి పన్ను, నల్లా బిల్లులను పూర్తిగా మాఫీ చేస్తామని ప్రకటన చేసింది.ప్రస్తుతం బొమ్మకల్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 62 మంది విద్యార్థులుండగా.. ఉన్నత పాఠశాలలో ఆ సంఖ్య కేవలం 23కి పడిపోయింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉపాధ్యాయుల కొరతతో పాటు, భవిష్యత్తులో స్కూల్ పూర్తిగా మూతపడే ప్రమాదం ఉందని గ్రామస్తులు, అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యను భారీగా పెంచాలనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి వేముల శ్రీకాంత్ అధ్యక్షతన ఆరుగురు వార్డు సభ్యులు అత్యవసర ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం.. ప్రభుత్వ బడికి పిల్లలను పంపే కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తూ పన్నులు మాఫీ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ ప్రత్యేక రాయితీ ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం పూర్తయ్యే వరకు వర్తిస్తుందని సర్పంచ్ వేముల శ్రీకాంత్ స్పష్టం చేశారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లేదా ఉన్నత పాఠశాల.. ఈ రెండింటిలో ఏ బడిలో పిల్లలను చేర్చినప్పటికీ ఆయా కుటుంబాల ఇంటి పన్ను, నల్లా బిల్లుల రద్దు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. కేవలం పన్నుల మినహాయింపు మాత్రమే కాకుండా.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కుటుంబాలకు భవిష్యత్తులో గ్రామ పరిధిలో అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలలో సైతం మొదటి ప్రాధాన్యత కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పాలకవర్గం వెల్లడించింది.గ్రామ పంచాయతీ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి క్షేత్రస్థాయిలో, సోషల్ మీడియా వేదికగా అద్భుతమైన స్పందన లభిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఈ పన్నుల మాఫీ పథకం గురించి వివరిస్తున్నారు. ఈ వినూత్న ఆఫర్ ప్రకటించిన అతి తక్కువ సమయంలోనే ఇప్పటికే 12 మందికి పైగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా అడ్మిషన్లు పొందడం విశేషం. మరికొందరు తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చేర్పించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి గ్రామీణ స్థాయిలో తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం ప్రస్తుతం కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారడమే కాక.. రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు రోల్ మోడల్‌గా నిలుస్తోందని విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు.

## రికార్డు స్థాయి వరి దిగుబడి

### తెలంగాణలో సన్న బియ్యానికి రెక్కలు

హైదరాబాద్, జూన్ 18, దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచినప్పటికీ.. మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు మాత్రం ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు సన్న బియ్యం నిల్వలను అక్రమంగా దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. గత 10 రోజుల్లోనే కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు ధరలు పెరిగాయి. ముఖ్యంగా డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యాన్ని తక్కువ పరిమాణంలో మార్కెట్లోకి వదులుతూ వ్యాపారులు సామాన్య, మధ్యతరగతి వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు.దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. కానీ ఈ రికార్డు స్థాయి దిగుబడులు స్థానిక వినియోగదారులకు మాత్రం ఎలాంటి ఉపశమనాన్ని ఇవ్వడం లేదు. ఓ పక్క రాష్ట్రంలో పండించిన సన్న వడ్ల నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ.. ఓపెన్ మార్కెట్లో మాత్రం సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొంతమంది రైస్ మిల్లర్లు, పెద్ద ఎత్తున వ్యాపారం చేసే హోల్‌సేలర్లు కుమ్మక్కై మార్కెట్లో సన్న బియ్యానికి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. ఈ అక్రమ నిల్వలు, సిండికేట్ దందా కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల బడ్జెట్ తలకిందులవుతోంది.ట్రేడర్లు, రిటైల్ వ్యాపారుల చెప్పిన వివరాల ప్రకారం.. గత 10 రోజుల్లోనే వివిధ రకాల సన్న బియ్యం ధరలు కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు పెరిగాయి. మధ్యతరగతి ఇళ్లల్లో ఎక్కువగా ఉపయోగించే సాంబ మసూరి రకం ధర నిన్నమొన్నటి వరకు కిలో రూ. 62 ఉండగా.. అది ఇప్పుడు ఏకంగా రూ. 68 కి చేరింది. మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యం నిల్వలను మిల్లర్లు గోడౌన్లలోనే తొక్కిపెట్టారని, వాటిని హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ ఏజెంట్ల ద్వారా అత్యధిక ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారని తెలుస్తోంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న రకాలను మాత్రమే టార్గెట్ చేసి ఈ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఏటా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వం, వివిధ సంస్థలు సేకరిస్తున్నాయి. దీనికి అదనంగా మరో 10 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యమైన సన్న వడ్లను మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉత్పత్తి అవుతోంది. ఇంత భారీ స్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ మార్కెట్లో కొరత ఏర్పడటం వెనుక పెద్ద స్కామ్ ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. పేద, దిగువ మధ్యతరగతి వర్గాల నుంచి సంపన్నుల వరకు అందరూ రోజువారీ ఆహార అవసరాల కోసం సన్న బియ్యాన్నే ఇష్టపడుతుండటంతో వీటికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా కర్నూలు, నిజామాబాద్, బాపట్ల, కరీంనగర్ జిల్లాల సోనామసూరి రకాలకు మార్కెట్లో విపరీతమైన క్రేజ్ ఉంది.సన్న బియ్యం పోషక విలువలతో కూడిన ముఖ్యమైన ఆహారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం వైట్ రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకే సరఫరా చేస్తుంది. దీంతో బహిరంగ మార్కెట్లో సన్న బియ్యానికి డిమాండ్ మరింత పెరిగింది. ఈ మార్కెట్ డిమాండ్‌ను కొందరు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. నిల్వలను బ్లాక్ చేసి, మార్కెట్లోకి తగినంత స్టాక్ రాకుండా అడ్డుకుంటున్నారు. బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో రైస్ మిల్లులపై దాడులు నిర్వహించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

## కార్పొరేట్‌కు దీటుగా సర్కారీ స్కూల్ నర్సరీ టు ఇంటర్ ఫ్రీ..

హైదరాబాద్, జూన్ 18 తెలంగాణ విద్యా రంగంలో సరికొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోంది. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ రూపురేఖలను మార్చి, పేద, మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం సరికొత్త విప్లవానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో రూపుదిద్దుకున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ నేడు ప్రారంభం కానుంది. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా తొలి విడతలో పైలట్ ప్రాజెక్ట్‌గా నాలుగు పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసింది.రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ పైలట్ ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉచిత ఇంగ్లీష్ మీడియం విద్యను అందించే ఈ స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఉచిత బస్సు సౌకర్యం, కార్పొరేట్ స్థాయి క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 1,814 మంది విద్యార్థులతో ప్రైవేటు పాఠశాలలను తలదన్నేలా రూపుదిద్దుకున్న ఈ విద్యా మోడల్‌ను దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా 100 పాఠశాలలకు విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్ల, మంచాల పాఠశాలలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వంగూరు, పోల్కంపల్లి పాఠశాలలను మొదటి విడతలో అభివృద్ధి చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో ఇదే కాన్సెప్ట్‌ను రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 100 పాఠశాలలకు విస్తరించేందుకు ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణను సిద్ధం చేసింది. ప్రస్తుతం ఆరుట్ల టీపీఎస్‌లో రికార్డు స్థాయిలో 1814 మంది విద్యార్థులు చదువుతుండగా.. ప్రైవేట్ స్కూళ్ల నుంచి తమ పిల్లలను ఇక్కడికి మార్చేందుకు తల్లిదండ్రులు భారీగా తరలివస్తుండటంతో అప్పుడే నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం ఈ ప్రాజెక్ట్ విజయానికి నిదర్శనంగా నిలిచింది.

ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రత్యేకతలివే..

కార్పొరేట్ విద్యా సంస్థలకు పూర్తి భిన్నంగా.. ఒకే ప్రాంగణంలో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉచిత ఇంగ్లీష్ మీడియం విద్య అందుబాటులోకి వచ్చింది.

విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వం కోసం ప్రతిరోజూ ఉదయం పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం, మధ్యాహ్నం నాణ్యమైన భోజనంతో పాటు సాయంత్రం వేళల్లో హెల్తీ స్నాక్స్ కూడా ప్రభుత్వం ఉచితంగా అందించనుంది.

ఆరుట్ల చుట్టుపక్కల గ్రామాల నుండి విద్యార్థులు సురక్షితంగా, సకాలంలో పాఠశాలకు చేరుకోవడానికి వీలుగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఐదు స్కూల్ బస్సులను రవాణా సౌకర్యం కోసం ఏర్పాటు చేసింది.

అంతర్జాతీయ పాఠశాలలను తలదన్నేలా ఇక్కడ వినూత్నమైన డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సుసంపన్నమైన లైబ్రరీ, అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, విశాలమైన గాలి-వెలుతురు వచ్చే క్లాస్ రూమ్‌లను నిర్మించారు.

చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నిస్, క్యారమ్స్ వంటి ఆటల కోసం ప్రత్యేక కోర్టులను, అంతర్గత జిమ్ వసతిని ఏర్పాటు చేశారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక క్రీడా శిక్షకులను నియమించారు.

ఈ పాఠశాలల నిరంతర నిర్వహణ బాధ్యతను జిల్లాల్లో అదనపు కలెక్టర్లకు అప్పగించారు. ప్రతి స్కూల్ వద్ద వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి ఒక్కో అధికారి నిరంతరం అందుబాటులో ఉంటూ విద్యార్థుల రక్షణను, అవసరాలను పర్యవేక్షిస్తారు.

ప్రభుత్వ విద్యను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలన్న సీఎం రేవంత్ రెడ్డి సంకల్పానికి ఆరుట్లలో ప్రారంభమవుతున్న ఈ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఒక సజీవ సాక్ష్యంగా నిలవడమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్ర విద్యా రంగంలో ఒక సరికొత్త మైలురాయిగా నిలిచిపోనుంది.

### ఆక్వా రైతు కృష్ణంరాజు దారుణ హత్య

ముమ్మిడివరం, కొత్త మురమళ్లలో రొయ్యల చెరువు వద్ద ఆక్వా రైతు దాట్ల కృష్ణంరాజు (64)ను దుండగులు కొట్టి చంపి, రాళ్లు కట్టి రొయ్యల చెరువులో పడవేసారు. రాత్రి అయినా కృష్ణంరాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించి, పోలీసులకు సమా చారం ఇచ్చారు. చివరకు చెరువులో రాళ్లుతో కట్టిపడేసిన కృష్ణంరాజు మృతదేహం గుర్తించారుపోలీసులుకేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గురైన వ్యక్తి స్థానికఎమ్మెల్యేసమీపబంధువని సమాచారం.

### గోశాలలో వృద్ధుడి హత్య

కృష్ణా జిల్లా కంకిపాడు మండలం గోశాల గ్రామంలో ఒక స్థలం వివాదంలో మామను అల్లుడు హత్య చేసాడు. అల్లుడు మామ ఛాతి పై దాడి చేసాడు. ఘటనలో గోశాల కు చెందిన ఉప్పల సాంబశివరావు(65) ఘటనా స్థలంలోని మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ట్రాఫిక్ కష్టాలకు చెక్.. సరికొత్త కారిడార్ ప్లాన్

హైదరాబాద్, జూన్ 18 హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కీలకమైన ప్రణాళికలను సిద్ధం చేసింది. నగరంలో వ్యక్తిగత వాహనాల సంఖ్య 80 లక్షలు దాటడంతో, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ద్వారా కూకట్‌పల్లి వై జంక్షన్ నుంచి గండిమైసమ్మ, ఎల్బీనగర్ నుంచి నాగోల్ వంటి ముఖ్యమైన ప్రాంతాలలో రహదారులను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఈ ప్రణాళికలో భాగంగా రహదారుల విస్తరణతో పాటు ఆక్రమణల తొలగింపు, డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడం , విద్యుత్, గ్యాస్ పైపులైన్ల కోసం భూగర్భంలో ప్రత్యేక మార్గాలు చేపట్టనున్నారు. దీనివల్ల రోడ్లను పదేపదే తవ్వాల్సిన అవసరం ఉండదు. అలాగే పాదచారులకు, దివ్యాంగులకు అనుకూలమైన ఫుట్‌పాత్‌లు, ర్యాంపులు, ఆధునిక బస్ షెల్టర్ల నిర్మాణం , సిగ్నల్ రహిత ప్రయాణం కోసం ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను కూడా నిర్మించనున్నారు. ఈ పనులు పూర్తి చేయడం ద్వారా నగరంలో ట్రాఫిక్ వేగం ప్రస్తుతమున్న గంటకు 15 కిలోమీటర్ల నుండి 30-40 కిలోమీటర్లకు పెరగడమే కాకుండా, ప్రమాదాలు తగ్గడం , భూముల విలువలు పెరగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని అంచనా. అయితే, భూసేకరణ , పనుల సమయంలో ఎదురయ్యే ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేందుకు సరైన ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు

గ్రేటర్ చుట్టూ లింక్ రోడ్లు

మహానగరం హైదరాబాద్‌తో పాటు శరవేగంగా విస్తరిస్తున్న శివారు ప్రాంతాల రూపురేఖలను మార్చేలా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఒక సరికొత్త రవాణా వ్యూహాన్ని సిద్ధం చేసింది. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు, ఐటీ కారిడార్‌ను ఇతర శివారు మండలాలతో సులభంగా అనుసంధానించేలా మరో 50 కొత్త లింక్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు ఖరారు చేశారు. ప్రధాన జాతీయ రహదారులు, రేడియల్ రోడ్లను కలుపుతూ సాగే ఈ మిస్సింగ్ లింక్ రోడ్ల ప్రాజెక్టు.. గ్రేటర్ పరిధిలోని ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడమే కాకుండా, నగర విస్తరణకు కొత్త ద్వారాలు తెరవబోతోందిహెచ్‌ఎండీఏ సిద్ధం చేసిన ఈ తాజా రోడ్ మ్యాప్‌లో తూర్పు మరియు ఉత్తర హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు అత్యధిక ప్రాధాన్యత లభించింది. ముఖ్యంగా ఉప్పల్-వరంగల్ హైవేను ఆనుకుని ఉన్న పీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధితో పాటు నాగారం, దమ్మాయిగూడ, కీసర రూట్లలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేలా ఈ లింక్ రోడ్లను డిజైన్ చేశారు. మరోవైపు, శరవేగంగా పారిశ్రామికంగా, నివాస ప్రాంతాలుగా ఎదుగుతున్న మేడ్చల్, గుండ్లపోచంపల్లి కారిడార్ల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వైపు తక్కువ సమయంలో చేరుకునేలా అవుటర్ రింగ్ రోడ్ కి సమాంతరంగా, అనుసంధానంగా కొత్త రోడ్డు మార్గాలు ఈ ప్లాన్ ద్వారా అందుబాటులోకి రానున్నాయి. ఈ మెగా కనెక్టివిటీ ప్రకటన వెలువడటమే ఆలస్యం.. ఆయా కారిడార్లలోని రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఒక్కసారిగా కదలిక మొదలైంది. కొత్త లింక్ రోడ్లు ప్రయాణించబోయే గ్రామాలు, లేఅవుట్లలో భూముల ధరలకు డిమాండ్ భారీగా పెరిగింది. మౌలిక వసతుల కల్పన వేగవంతం కానుండటంతో.. ఓపెన్ ప్లాట్లు, నివాస స్థలాల ధరలు చదరపు గజానికి కనీసం రూ.3,000 నుండి రూ.5,000 వరకు తక్షణమే పెరిగే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ మార్కెట్ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. నిన్నమొన్నటి వరకు రవాణా సౌకర్యం సరిగా లేక వెనుకబడిన శివారు భూములు సైతం.. ఇప్పుడు ఈ లింక్ రోడ్ల మాస్టర్ ప్లాన్ ఎఫెక్ట్‌తో హాట్ కేకుల్లా మారుతున్నాయి. ఈ రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, నిధుల సమీకరణ ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. రోడ్డు కనెక్టివిటీ స్పష్టంగా ఉండటంతో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ల్యాండ్ డెవలపర్లు, బిల్డర్లు పీర్జాదిగూడ, మేడ్చల్, శంషాబాద్ పరిసర బెల్ట్‌లలో వందలాది ఎకరాలలో కొత్త డీటీసీపీ, హెచ్‌ఎండీఏ అప్రూవ్డ్ లేఅవుట్లు, గేటెడ్ కమ్యూనిటీలను ప్లాన్ చేస్తున్నారు. నగరానికి దూరంగా ఉన్నా సరే, సులభంగా ఐటీ కారిడార్‌కు చేరుకునే వెసులుబాటు లభించనుండటంతో మధ్యతరగతి కొనుగోలుదారులకు, దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఈ శివారు ప్రాంతాలు ఇప్పుడు అత్యంత సురక్షితమైన మరియు లాభదాయకమైన గమ్యస్థానాలుగా మారుతున్నాయి.

# అంతేరా రెస్టారెంట్, లా పినోజ్ పిజ్జా రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడి



హైదరాబాద్ మియాపూర్లోని మదీనాగూడలో ఉన్న అంతేరా రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చే'ఇఐఎ. ఫంగస్ ఏర్పడిన కాలీఫ్లవర్ ఇతర కూరగాయలు, వంటకు వాడరాని నూనె, లేబుల్స్ లేకుండా కూరగాయల నిల్వలు గుర్తించి ఇంప్రూవ్మెంట్ నోటీసులు జారీ చేసారు.

హైటెక్ సిటీ జూబ్లీ ఎంక్లేవ్లోని లా పినోజ్ పిజ్జా రెస్టారెంట్పై దాడులు చేసి ఫ్రిజ్లో పురుగులు, కిచెన్లో బొద్దింకలు, వెజ్ మరియు నాన్ వెజ్ పదార్థాలు ఒకే చోట నిల్వ ఉంచడం, ఆహార పదార్థాలు నిల్వ ఉంచే చోట బల్లి విసర్జనలు ఉన్నట్లు గుర్తిం,ఆరు. నోటీసులు జారీ చేసారు.

# గోడ కూలి కారులో ఉన్న ఇద్దరు మృతి



మహబూబ్ నగర్ వర్షం కురుస్తున్న సమయంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిపై నుంచి ప్రహరీ గోడ కారుపై అకస్మాత్తుగా కూలిపోయింది. ఘటనలో కారులో ఉన్న సివిల్ ఇంజినీర్ జగన్నాథ్ రెడ్డి, డ్రైవర్ సంతోష్ మృతి చెందారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలో ఘటన జరిగింది.

## మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

## మామిడి రైతులకు మద్దతుగా వైసీపీ ఆధ్వర్యంలో ఆందోళన

చిత్తూరు జీడి నెల్లూరు జైన్ ఫ్యాక్టరీ ఎదుట మామిడి రైతులతో వైసీపీ నిరసన కు దిగింది. మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసారు. గత ఏడాది మామిడి పంటకు కిలో 12 రూపాయలు గిట్టు బాటు ధర కల్పించింది ప్రభుత్వం. ఈ ఏడాది మామిడి పంటను జ్యూస్ ఫ్యాక్టరీలు తక్కువ ధరకే కిలో 4 - 5 రూపాయలు మించి కొనుగోలు చేయడంలేదు. తోతాపురి మామిడి పంటకు కిలో 15-20 రూపాయలు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసారు. తిరుపతి , చిత్తూరు జిల్లాలు వైసీపీ అధ్యక్షుడు భూముల కరుణాకర్ రెడ్డి నేతృత్వంలో జైన్ ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన జరిగింది.

# ఫారెస్ట్ శాఖ వర్సెస్ రెవెన్యూ శాఖ

నిజామాబాద్, జూన్ 18 బోథ్ నియోజకవర్గ పరిధిలో అటవీ శాఖ, రెవెన్యూ శాఖల మధ్యన ఉన్న అటవీ భూముల లెక్క ఇప్పటికీ తేలక పోవడంతో కొంతమంది మొరం మాఫియా కీడుగాలకు అందినంత దోచుకునే అవకాశం లభించింది. దీంతో నేరడిగొండ బోత్ ఇచ్చోడ బజార్హత్నూర్ మండలాల్లో విచ్చలవిడిగా మొరం వ్యాపారం కొనసాగుతున్నది. రాత్రిపూట మొరం మాఫియా మూట కాపలాదారులను పెట్టి విచ్చలవిడిగా మొరం తవ్వకు పోతున్నారు. నేరడిగొండ మండలంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిని అనుకుని ఉన్న కుమారి చుట్టుపక్కల ఉన్న ఎర్ర మొరం గుట్టలు మొరం మాఫియా బంగారు బాతులా మారాయి.

44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఎర్ర మొరం క్వారీని ఆనుకొని అటవీశాఖ భూమి ఉండడం ఆ భూమిలో ఏ కొంచెం తవ్విన అటవీ శాఖ వారు పట్టుకొని జరిమాణాలు విధిస్తుండటంతో అక్రమ మొరం వ్యాపారులు రెవెన్యూ భూములపై దృష్టి సారించి విచ్చలవిడిగా తరలించకపోతున్నారు. లోకల్ నేరడిగొండ మండలంలోని వడూర్ ,రాజుల తాండ, బుద్ధికొండ, బోథ్ మండలంలోని పిప్పలదరి ,కొత్త కరత్వాడ ,బోత్, ధనుర్ , రఘునాథపూర్, సోనాల మండలంలోని సాకేర, కోట కె సోనాల టివి టి గ్రామాల పరిసరాలలో ఉన్న గుట్టలలో నుండి ప్రతిరోజు వందల సంఖ్యలో తిప్పల ద్వారా మొరం తరలించకు పోతున్నారు . బోథ్ సోనాల మండలాల్లో అక్రమ మొరం తవ్వకాలు ప్రభుత్వ కార్యాలయాల ముందు నుండి పట్టపగలే మొరం ట్రాక్టర్లో తరలిస్తున్నారు. అడిగేవాడు లేకపోవడంతో మొరం మాఫియా పట్టపగలు గుట్టలను తవేసి మొరం అమ్మకాలు కొనసాగిస్తున్నారు. కొంతకాలం పాటు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కంటూ అధికారుల వద్ద నుండి అనుమతులు పొంది బయట వ్యక్తులకు విచ్చలవిడిగా విక్రయించు కున్నారు.. సహజ వనరులు అయినా మొరం గుట్టలను పట్టపగలు రాత్రిపూట తవ్వకాలు కొనసాగిస్తూ విచ్చల విడిగా ఇసుక మొరం అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేటు భవనాలకు సమీపంలోని వాగుల నుండి నల్ల ఇసుకను పునాదులకు అవసరమైన పునాది రాళ్లను తరలిస్తున్నారు. పో చ్చర సమీపంలో నిర్మిస్తున్న ఓ ప్రైవేటు భవనానికి గ్రామం సమీపంలోని వాగులో నుండి నల్ల ఇసుక పునాది రాళ్లను తరలించిపోయారు. అక్రమ దందా కొనసాగుతున్న అటవీ శాఖ రెవెన్యూ శాఖల అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయివాస్తవానికి మైనింగ్ అధికారుల నిబంధనల ప్రకారం మూడు ఫీట్ల కన్నా ఎక్కువ లోతుగా తగిలితే అవసరమైన అనుమతులు పొందాల్సి ఉంటుంది కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే కొత్త కర త్వాడ మిషన్ భగీరథ ట్యాంక్ కుడివైపున ఉన్న రెవెన్యూ గుట్టను 15 నుండి 20 ఫీట్ల వరకు తవ్వి మొరం తరలించారు. ఇంత బహిరంగంగా జరుగుతున్న ఈ వ్యాపారంపై అధికారులు చూడనట్లు వ్యవహరిస్తుండటంతో విమర్శలు వస్తున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న బట్టలు తమవి కావలి అటవీశాఖ వారు పేర్కొంటుండగా రెవెన్యూ శాఖ వారు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ శాఖ గుట్టలుగా పేర్కొంటున్న వాటి పైన ఉన్న చెట్లు అటవీ శాఖ వారివి అయితే గుట్టలేము రెవెన్యూ శాఖ వారిగుట్టపై చెట్లను కొడితే అటవీ శాఖ వారు కేసులు చేస్తుంటే మొరం తీసుకువెళ్తే తమకు సంబంధం లేదంటూ అటవీ శాఖ వారు చేతులెత్తేస్తున్నారు రెండు శాఖల సమన్వయ లోపం వల్ల కోట్లాది రూపాయల మొరం తరలిపోయింది .

# పోలీసుల వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య





విజయనగరం సంతకవిటి మండలం రామరాయపురంలో విషాదం నెలకొంది. పోలీసుల పలుమార్లు విచారణకు పిలవడంతో తల్లీకొడుకులు కళావతి, చిరంజీవి రైలు క్రిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఆఖరి క్షణంలో కొడుకును పక్కకునెట్టి తల్లి ఆత్మహత్య చేసుకుంది.

గత నెల 25న ఓ ఇంట్లో 4 తులాల బంగారం, రూ.10 వేల నగదు చోరీ అయ్యాయి. అనుమానంతో వీరినే పదే పదే పోలీస్ స్టేషన్ కు పిలవడంతో మనస్తాపానికి గురయ్యారు.

# రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు, కొడుకు మృతి

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మురహరపల్లి రాజీవ్ రహదారిపై అర్ధ రాత్రి జరిగిన ప్రమాద ఘటన స్థలాన్ని మేడ్చల్ ఏసిపి శంకర్ రెడ్డి పరిశీలించారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో కరీంనగర్ కు చెందిన రైల్వే ఉద్యోగి చంద్ర శేఖర్ మరియు అతని భార్య రేఖ మరియు రేఖ చెల్లెలి కుమారుడు నిహాల్ 2 సంవత్సరాలు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కారు అదుపు తప్పి అటుగా వస్తున్న లారీని బలంగా ఢీ కొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదానికి నిద్ర మత్తే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులను పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించామని ఏసీపీ మీడియాకు తెలిపారు..

# నా చావుకు కారణం కృష్ణలంక సీఐ నాగరాజు

విజయవాడ సాయి కృష్ణ ఉదంతం ఒక కొలిక్కి రాకముందే విజయవాడ నగరంలోఓ మరో యువకుడి సెల్ఫీ వీడియో వైరల్ అయింది. ఇప్పటికే గాదె సాయికృష్ణ కేసులో సస్పెండ్ అయిన సీఐ నాగరాజు గురించి మరో వీడియో హల్చల్ అయింది. విజయవాడకు చెందిన క్రాంతి కుమార్ సెల్ఫీలో నేను.. నేను మా×గ పుటక పుట్టడమే తప్పైపోయింది. నన్ను వేటాడి, వెంటాడి వేధిస్తున్నారు. మూడు నెలల నుంచి నన్ను కొడుతూనే ఉన్నారు. నేను ఇంక బతకలేకపోతున్నాను. నా చావుకు కారణం కృష్ణలంక సీఐ. ఇదిగో గుళికల మందు తాగేస్తున్నాను. నా చావుకు కారణం కృష్ణలంక సీఐ అని ఆత్మహత్య చేసుకున్నాడు.

# ఖమ్మంలో లైంగిక దాడికి గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికకు శస్త్రచికిత్స

**నిమ్స్‌లో బాలిక తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పిన మంత్రి సీతక్క,**
**తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ జస్టిస్ పంచాక్షరి**
**బాలికకు అందుతున్నవైద్య చికిత్సపై వివరాలు తెలిపిన వైద్యులు**
**ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఆర్థిక సహాయ చెక్కును అందజేసిన మంత్రి సీతక్క, జస్టిస్ పంచాక్షరి**

హైదరాబాద్ ఖమ్మం జిల్లాలో లైంగిక దాడికి గురై ప్రస్తుతం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు మంత్రి సీతక్క, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ జస్టిస్ పంచాక్షరి నిమ్స్ ఆసుపత్రిని సందర్శించారు.

ఈ సందర్భంగా బాలికకు అందుతున్న వైద్య చికిత్స, శస్త్రచికిత్స అనంతర పరిస్థితిపై వైద్యులు వారికి వివరించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నట్లు వైద్య బృందం తెలిపింది.




అనంతరం బాలిక తల్లిదండ్రులను కలిసిన మంత్రి సీతక్క వారికి ధైర్యం చెప్పారు. అధైర్యపడవద్దని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో మీ కుటుంబానికి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. బాలిక పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన వైద్యం అందించడంతో పాటు అన్ని విధాలుగా సహాయం చేస్తామని తెలిపారు.

===ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున బాధిత బాలిక కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయ చెక్కును మంత్రి సీతక్క, జస్టిస్ పంచాక్షరి కలిసి అందజేశారు. బాలిక చికిత్స, పునరావాసం, కుటుంబ అవసరాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పేర్కొన్నారు. బాలిక ఆరోగ్యం మెరుగుపడి సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కుటుంబానికి అవసరమైన ఆర్థిక, న్యాయపరమైన సహాయాన్ని కూడా అందిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు

# మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి



బేగంపేటలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్ విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అనంతరం మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కేటీఆర్

ఈరోజు హైదరాబాద్‌లోని బేగంపేటలో ఉన్న స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించి విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు.

తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చిన కేటీఆర్, "16 భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన పీవీ నరసింహారావు దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలి" అని ఆకాంక్షించారు.

తెలంగాణ రాష్ట్రంలో 2023లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వంలో ప్రారంభించిన 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం'ను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

గత ప్రభుత్వంలో విద్యారంగంలో అనేక కార్యక్రమాలు చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల సంక్షేమానికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు.

"పిల్లలతో గడిపే ప్రతి క్షణం ఆనందాన్ని ఇస్తుంది. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌కు అవసరమైన అదనపు తరగతి గదులు, ఆధునిక లైబ్రరీ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

విద్యార్థులకు అండగా నిలుస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సేవలను ప్రశంసించారు.

# ఖబర్దార్ కేటీఆర్

## రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్** 18. మంగపేట లి ఇసుక క్వారీ కోసం అమాయక ప్రజలను కొట్టించి దందా నడిపించింది నువ్వు కాదా..

బి ఆర్ ఎస్ హయాంలో నిబంధనలు ఉల్లంగించి తుంగలో తొక్కి క్వారీ నడిపింది నువ్వు...

ములుగు జిల్లా లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం గా ఏ క్వారీ నడిచిన దాన్ని మూసేస్తాం...

నిబంధనలకు విరుద్ధం గా ములుగు జిల్లా లో ఒక్క క్వారీ నడిచినట్టు నువ్ రుజువు చేస్తావా కేటీఆర్ సవాల్ కు సిద్ధమా...

గత పదేళ్ల మీ పాలనా లో కమిషన్ లకోసం కక్కుర్తి పడి మండలం కు 5 లేదా ఆరు గిరిజన సోసైటీ లు ఉంటే మీరు వాటిని ఒక్కో ఊరుకి 5 లేద 6 పర్మిషన్ లు ఇచ్చింది మీరు కాదా...

ఓవర్ లోడ్ జిరో దందా లలో కమిషన్ లతో వ్యాపారం చేసింది మీరు కాదా...

ప్రజా ప్రభుత్వం ఏర్పాటు జరిగిన దగ్గర నుండి ఇప్పటివరకు ఏ ఒక్క క్వారీ కి పర్మిషన్ ఇవ్వలేదు...

నిన్నటి వరకు జరిగిన క్వారీ ల పర్మిషన్ లు ఇచ్చింది మీ ప్రభుత్వం లోనే కేటీఆర్

ములుగు జిల్లా లో ఇప్పుడు మొత్తం మీద కనీసం 5 క్వారీ లు కూడా ఇప్పటివరకు నడవలేదు..

నిత్యం అబద్ధాలతో పోటీ పడి చెప్పడం మీ బి ఆర్ ఎస్ పార్టీ కే సాధ్యం...

ములుగు జిల్లా లో 12 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక డిసిల్ట్ టేషన్ ఎక్కడ జరిగిందో నిరూపణ కు సిద్ధమా..

ఒక ఆదివాసీ గిరిజన బిడ్డ మంత్రి అయితే ఓర్చుకొని దోర.

మీ బి ఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన దందాలు లెక్కలేనివిగా ఉన్నాయి

ఖమ్మం సభలో గిరిజన ఇసుకపు వారిలో గురించి చేసిన వాక్యాలను వెంటనే వెనక్కి తీసుకోవాలి వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి ఆరోపణ చేయడం హాస్యస్పదంగా ఉంది

మీ ప్రభుత్వంలో ఇసుక రంగంలో జరిగిన దోపిడీ తెలంగాణ ప్రజలందరికీ తెలుసు గిరిజన సొసైటీలకు సరైన అనుమతులు ఇవ్వకుండా అడ్డగోలుగా ఓవర్ లో బిజినెస్ నడిపించి సొమ్ము చేసుకుంది ఎవరో

ఇరిగేషన్ క్వారీల పేరుతో ఏమి జరిగిందో డబుల్ బెడ్ రూమ్ ఇసుక పేరుతో ఎంత దోపిడీ జరిగిందో తెలంగాణ ప్రజలకు బాగా తెలుసు అంతే కాదు అడ్డగోలుగా వ్యాపారం చేయించి గిరిజన సొసైటీలకు రావాల్సిన బిల్లులు కూడా ఇవ్వకుండా జరిగిన న్యాయానికి మీరు ప్రజలకు క్షమాపణ చెప్పాలి గిరిజన కుటుంబాల ఉపాధి పై దెబ్బకొట్టే ప్రయత్నం చేయవద్దు ఇలాంటి రాజకీయాలతో ప్రజల విశ్వాసాన్ని మరింత కోల్పోతారు నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్య పరిష్కారం కోర్స్ నిరంతరం ప్రజల మధ్యలో ఉండు ప్రజా సమస్యల పరిష్కారం కోసం శ్రమించే ఆదివాసి గిరిజన బిడ్డ మంత్రిగా ఉంటే ఓర్చుకోలేని నువ్వు దళిత బిడ్డ శాసనసభ స్పీకర్ అయితే అసెంబ్లీ సమావేశాలకు కూడా హాజరుకాని మీరు కూడా విమర్శించడం సరికాదని అన్నారు

## లోక్ అదాలత్ మంచి అవకాశం: పోలీస్ కమిషనర్



సిద్దిపేట జూన్ 20 న జాతీయ లోక్ అదాలత్ జరగనున్నది చిన్న చిన్న కంపౌండబల్ కేసులలో కోర్ట్ చుట్టూ తిరుగుతున్న ప్రజలకి ఇదొక మంచి అవకాశం. రాజీ పడదగిన కంపౌండబుల్ కేసులు,సివిల్ తగాదా కేసులు,ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు టౌన్ న్యూసెన్స్ కేసులు,చెక్ బౌన్స్ కేసులో మరియు ఇతర రాజీ పడ దగిన కేసులలోని నిందితులు,ఫిర్యాదీదారులు సంబంధిత పోలీస్ స్టేషన్ ని లేదా న్యాయస్థానాన్ని నేరుగా సంప్రదించి రాజి పడవచ్చు..చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని,డబ్బులను వృధా చేసుకోవద్దు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి. పోలీస్ అధికారులు ప్రతి పోలీస్ స్టేషన్ లో రాజీ పడ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పిస్తున్నారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని ఎస్. రష్మీ పెరుమాళ్ సిద్దిపేట్ పోలీస్ కమిషనర్ తెలిపారు

# రైతులకు రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేయాలి

## జూన్ 30 చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయండి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు మందపాటి రమణారెడ్డి

పిడుగురాళ్ల, :రైతులకు రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేయాలని జూన్ 30వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మందపాటి రమణారెడ్డి అన్నారు. గురువారం పిడుగురాళ్ల ఎస్ టి యూ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమావేశంలో రమణారెడ్డి మాట్లాడుతూ, గత రెండేళ్లుగా రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా మన రాష్ట్రంలో రెండు లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి ఆత్మహత్యల నుంచి రైతాంగాన్ని కాపాడాలని అన్నారు. గురజాల నియోజకవర్గం కార్యదర్శి కందిమళ్ల సైదారావు మాట్లాడుతూ, డాక్టర్ ఎం ఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇచ్చి,



పంట రుణాలను ఇవ్వాలన్నారు. విజయవాడలో జరుగు ధర్నా చౌక్ వద్దకు ఈ నెల 30వ తేదీన గురజాల నియోజకవర్గం నుంచి రైతులు పాల్గొని ముఖ్యమంత్రి కార్యాలయం రాయబారాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కందిమళ్ళ అంజలి, అక్కెనపల్లి బాలయ్య, షేక్ సైదా, షేక్ నజీర్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ పురోగతిపై మంత్రి పొన్నం సమీక్ష



హైదరాబాద్ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఆర్టీసీ సమ్మె సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎస్–2021కు సంబంధించిన 11 శాతం ఫిట్మెంట్ను జూలై 1 నుంచి అమలు చేయాలని నిర్ణయించాం. అలాగే ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ను త్వరలో విడుదల చేసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు.



నాగర్కర్నూల్, పెద్దపల్లి డిపో పనులను వేగవంతం చేయడంతో పాటు మంజూరైన బస్ స్టేషన్ల శంకుస్థాపనలకు కార్యాచరణ రూపొందించాలని సూచించాను. ఆత్మహత్య చేసుకున్న ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు అందించే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

త్వరలో దక్షిణ భారత రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్లు, ఆర్టీసీ ఎండీలతో సమావేశం నిర్వహించి ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధిపై చర్చించనున్నామని మంత్రి వెల్లడించారు.

# రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర జీవన్ రెడ్డి

హైదరాబాద్ ప్రభుత్వం బోనస్ ఇస్తామంటున్న 7 రకాల వడ్ల వల్ల రైతులు ఎకరానికి 10 క్వింటాళ్లు నష్టపోతారు. అంటే ఒక్కో రైతుకు రూ. 24 వేల దిగుబడి తగ్గే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేత జీవన్ రెడ్డి అన్నారు. గురువారం అయన మీడియాతో మాట్లాడారు.

33 రకాల వడ్లలో ప్రభుత్వం గుర్తిస్తున్న 7 రకాల వడ్లు ఎకరాకి 20 క్వింటాళ్లు పండితే మిగతా 26 రకాలు మాత్రం ఎకరాకు 30 క్వింటాళ్లు పండుతాయి. ఈ 7 రకాల వడ్లు పండించడం వల్ల రైతులు 10 క్వింటాళ్లు ఎక్కువ నష్టపోతారని అన్నారు.

రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుంది. ఈ ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టకపోవడంతో 7600 మంది చనిపోయిన రైతులకు రైతు బీమా డబ్బులు రాలేదు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను కనుమరుగు చేయాలని చూస్తే ప్రజలు ఈ కాంగ్రెస్ నాయకులను కనుమరుగు చేస్తారు జాగ్రత్త అని హెచ్చించారు.

## ఉచిత కంది మినీకిట్ల పంపిణీ

### .మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్

### 250 మంది రైతులకు లబ్ధి.. కంది సాగు విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం




సి. బేళగల్, రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు పప్పుధాన్యాల ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా సి. బేళగల్ మండలంలో ఉచిత కంది మినీకిట్ల పంపిణీ కార్యక్రమాన్నిగురువారం ఘనంగా నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జి. మల్లేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు కంది విత్తనాలను అందజేయడంతో పాటు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జి. మల్లేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఏటా వివిధ పంటలకు సంబంధించి ఉచిత మినీకిట్లను అందజేస్తోందని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కంది సాగును ప్రోత్సహించేందుకు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు మొత్తం 250 ఉచిత కంది మినీకిట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఒక్కో మినీకిట్‌లో నాలుగు కిలోల నాణ్యమైన కంది విత్తనం ఉంటుందని పేర్కొన్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. కంది పంట తక్కువ నీటితో సాగు చేయగలిగే పంట కావడంతో పాటు మంచి మార్కెట్ ధరను కూడా కలిగి ఉంటుందని అన్నారు. అందువల్ల రైతులు వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలతో పాటు కంది సాగుపై కూడా దృష్టి సారించాలని కోరారు.

# సునీల్ ను తలంటిన హైకోర్టు

## ఎంపీపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా.

## మీకు ఉగ్రవాదులకు తేడ ఏంటీ అంటూ ప్రశ్న

విజయవాడ, జూన్ 19 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి తిరుగుబాటు ఎంపీ రఘురామకృష్ణ రాజు అరెస్ట్, ఆపై సీఐడీ కస్టడీలో జరిగిన థర్డ్ డిగ్రీ వేధింపుల కేసు ఇప్పుడు ఐపీఎస్ అధికారుల మెడకు గట్టిగా చుట్టుకుంటోంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి, నాటి సీఐడీ అదనపు డీజీ పీవీ సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గురువారం అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒక దేశ పార్లమెంట్ సభ్యుడిని కస్టడీలో చిత్రహింసలకు గురిచేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని వ్యాఖ్యానిస్తూ.. అసలు ఎప్పటిలోగా సరెండర్ అవుతారు అని నిందితుడైన ఐపీఎస్ అధికారిని న్యాయస్థానం నిలదీసింది. హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఈ కేసు తీవ్రతను వివరిస్తూ సంచలన పోలికను తెరపైకి తెచ్చింది. దేశ అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంట్‌పై దాడి చేసిన ఉగ్రవాదులకు.. ఒక పార్లమెంట్ సభ్యుడిని చట్టవిరుద్ధంగా కస్టడీలో పెట్టి శారీరకంగా వేధించిన వారికి మధ్య పెద్ద తేడా లేదు అని హైకోర్టు అభిప్రాయపడింది. చట్టాన్ని రక్షించాల్సిన ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా తనను తాను నియంత్రించుకోవాల్సిన కనీస బాధ్యత లేదా అని ప్రశ్నించింది. ఎంపీ రఘురామకృష్ణ రాజును గుంటూరు సీఐడీ ఆఫీసులో అర్ధరాత్రి వేళ బూటుకాళ్లతో తన్నుతూ, అరికాళ్లపై కొడుతూ అమానుషంగా హింసించబోతున్నారనే విషయం ఫిర్యాదుదారుగా ఉన్న సునీల్ కుమార్ నాయక్‌కు ముందే తెలుసని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా ఆధారాలు కనిపిస్తున్నాయని కోర్టు పేర్కొంది. ఇలాంటి కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ముందస్తు బెయిల్ ఒక రక్షణ కవచంగా మారకూడదని బెంచ్ తేల్చిచెప్పింది. న్యాయస్థానం ఘాటు వైఖరిని గమనించిన సునీల్ నాయక్ తరఫు న్యాయవాది సైలెంట్ అయ్యారు. దీంతో కోర్టు స్పందిస్తూ.. ఈ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొనసాగిస్తారా, లేక చట్టాన్ని గౌరవించి స్వచ్ఛందంగా పోలీసుల ఎదుట సరెండర్ అయ్యే మార్గాన్ని ఎంచుకుంటారా అనేది తేల్చుకోవాలని స్పష్టమైన ఛాయిస్ ఇచ్చింది. దీనిపై పిటిషనర్‌తో మాట్లాడి కోర్టుకు తమ నిర్ణయాన్ని తెలియజేస్తామని లాయర్ కోరడంతో.. హైకోర్టు ఈ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఎలాంటి తుది ఉత్తర్వులు ఇవ్వకుండా తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. 2021లో అప్పటి ఎంపీ రఘురామకృష్ణ రాజుపై సీఐడీ నాన్-బెయిలబుల్ కేసు పెట్టి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అరెస్ట్ చేసి గుంటూరు తరలించారు. ఆ రోజు కస్టడీలో చిత్రహింసలు పెట్టారని రఘురామ ఆరోపించారు. ఆ విషయం అప్పట్లో వివాదాస్పదమయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, రఘురామకృష్ణ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు నగరంలోని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్ కుమార్, సునీల్ నాయక్, పి. సీతారామాంజనేయులు నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ , అప్పటి సీఐడీ అడిషనల్ ఎస్పీ విజయ్ పాల్‌లపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే విజయ్ పాల్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా, అరెస్ట్ భయంతో సునీల్ నాయక్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన విచారణకు హాజరు కాకపోవడంతో బీహార్ కు వెళ్లి అరెస్టు చేయాలనుకున్నారు. అయితే ఆయన అక్కడి పోలీసుల సాయంతో బయటపడ్డారు.

## రాష్ట్ర హోంమంత్రి అనితపై మాజీ మంత్రి అమర్నాథ్ చేసిన వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాం

## టిడిపి కర్నూల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి వి. రామలక్ష్మి.



మద్దికేర: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పై మాజీమంత్రి అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిడిపి కర్నూలు పార్లమెంటు అధికార ప్రతినిధి వి.రామలక్ష్మి తెలియజేశారు. రాజకీయ విమర్శల పేరుతో మహిళల వ్యక్తిత్వాన్ని ఆత్మ గౌరవాన్ని కించపరచడం చాలా దారుణమని టిడిపి కర్నూలు పార్లమెంటు అధికార ప్రతినిధి వి.రామలక్ష్మి పేర్కొన్నారు. గురువారం రోజున ఆమె మాట్లాడుతూ హోంమంత్రి అనితపై మాజీ మంత్రి అమర్నాథ్ కేజీ మైకప్ పూస్తుందని ఆడవారి వ్యక్తిగత విషయాలను విమర్శించడం అది ఎంత మాత్రం తగదని, మంత్రి అమర్నాథ్ నోరు అదుపులో పెట్టుకొని ఆడవారి పట్ల మంచి సంస్కారంతో నడుచుకోవాలని, లేదంటే ఆడవారి చేతులకు పని చెప్పే దుస్థితికి దిగజారొద్దని మాజీ మంత్రి అమర్నాథ్ ను హెచ్చరిస్తున్నామని ఆమె తెలియజేశారు. కుక్క తోక వంకర అన్నట్టుగా వైసిపి నాయకులు మహిళ పట్ల మర్యాదపూర్వకంగా మసులుకోవాలని, ఇలాంటి దిగుజారుడు విమర్శలను కొనసాగిస్తే మహిళలు మీ వైసీపీ నాయకుల్ని, ఎమ్మెల్యేలను, మాజీ మంత్రులను తరిమికొట్టే పరిస్థితి తథ్యమని ఆమె తెలియజేశారు. రాష్ట్రంలో జరుగుచున్న అభివృద్ధి పనుల వైపు ఆలోచించడం మానుకొని, మహిళల వ్యక్తిగత విషయాలపై శ్రద్ధ తగ్గించుకోవాలని టిడిపి కర్నూలు పార్లమెంట్ అధికార ప్రతినిధి వి.రామలక్ష్మి వైసీపీ శ్రేణులను హెచ్చరించారు.

## దళితుల మధ్య చిచ్చు పెడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ...



కొలిమిగుండ్ల జూన్ 18 నంద్యాల పట్టణంలో ఇవాళ నవ్యాంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొ్రపాటి శరత్ బాబు పర్యటించారు. సూరత్ హోటల్లో నవ్యాంధ్ర మాల మహానాడు సంఘం నాయకులు కార్యకర్తలతో కొ్రపాటి శరత్ బాబు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా నవ్యాంధ్ర మాల మహానాడు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సంగటి భాస్కరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు కొ్రపాటి శరత్ బాబు మాట్లాడుతూ మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాల మాదిగల మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుకుంటున్నాడని భవిష్యత్తులో వర్గీకరణ అనే అంశమే లేకుండా చేసేందుకు వారు కుట్ర పన్నుతున్నారని ఇప్పటికైనా మాలలు ఐకమత్యంతో ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొ్రపాటి శరత్ బాబు, నంద్యాల జిల్లా ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడు సంగటి భాస్కరరావు, రాయలసీమ జిల్లాల చైర్మన్ మద్దిలేటి, సంఘం సభ్యులు రమేష్, రామ్మోహన్, తిరుపతి రాజు, ఎస్ విజయ్ కుమార్, గురువయ్య, జె నాసరయ్య ఇంకా తదితర మాల మహానాడు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నగునూరు గ్రామంలో ఎరువుల గోదామును పరిశీలించిన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

కరీంనగర్ జిల్లాలో ఏయే ఎరువులు ఏ డీలర్లకు పంపిణీ చేశారనే వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలోని విత్తన కేంద్రాలు, ఎరువుల విక్రయ కేంద్రాలు మరియు ఇప్పటివరకు జరిగిన అమ్మకాల వివరాలను సమగ్రంగా పరిశీలించారు. అలాగే వరి, మొక్కజొన్న మరియు పత్తి విత్తన నిల్వలను గోదాములలో పరిశీలించారు. అనంతరం నగునూరు గ్రామంలోని అగ్రో రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిన వరి విత్తనాలైన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-1508 మరియు కేఎన్ఎం-1638 వంటి వంగడాలను పరిశీలించారు. వాటి విత్తన నిల్వ వివరాలను, టీఎస్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా సరఫరా చేసిన పెసర మరియు ఇతర విత్తనాల వివరాలను, అలాగే జీలుగజనుము విత్తనాల నాణ్యతను కూడా పరిశీలించారు. తదుపరి అక్కడ ఉన్న రైతులకు పాయింట్ ఆఫ్ సేల్ పిఓ ఎస్ యంత్రం ద్వారా జరిగే అమ్మకాల విధానాన్ని వివరించారు. రైతుల ఆధార్ నమోదు చేసి ఈ-పాస్ యంత్రం ద్వారా అవసరమైన కాంప్లెక్స్ ఎరువులను విక్రయించే ప్రక్రియను వారి సమక్షంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంచాలకులు కె. రణధీర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సత్యం మరియు ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# జలధారతో అన్నమయ్య జిల్లాకు జలవిజయం



రాయచోటి, జూన్ 18: అన్నమయ్య జిల్లాలో అమలవుతున్న జలధార కార్యక్రమం పక్కా ప్రణాళిక, సమర్థవంతమైన అమలు, సమన్వయంతో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా. గురువారం మదనపల్లి జిల్లా కేంద్రం ఆర్ఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో.. "2 ఏళ్ల నమ్మకం - సుపరిపాలన - అభివృద్ధి సంక్షేమం" పై పండుగ వాతావరణం లో అత్యంత ఘనంగా జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖామాత్యులు మరియు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మాత్యులు మరియు జిల్లా మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, శాసనసభ్యులు షాజహాన్ భాష, కిషోర్ కుమార్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మాజీ శాసనసభ్యులు, పార్లమెంట్, నియోజకవర్గ కూటమి పార్టీ ఇంచార్జిలు, కార్యకర్తలు, జిల్లా అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రులు మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ నాయకత్వంలో అమలవుతున్న ఈ కార్యక్రమం నీటి సంరక్షణ, చెరువుల అనుసంధానం, భూగర్భ జలాల పెంపు దిశగా విశేష ఫలితాలను అందించిందన్నారు. ముఖ్యంగా కరువు ప్రభావిత ప్రాంతాల్లో నీటి లభ్యత పెరగడంతో వ్యవసాయం, పశు సంవర్ధక రంగాలకు కొత్త ఊపునిచ్చిందని తెలిపారు. జలధార కార్యక్రమం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు నీటి భద్రతను కల్పించే దిశగా రూపొందించిన ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. జిల్లా స్థాయిలో ప్రారంభమైన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే స్థాయికి చేరుకోవడం జిల్లా యంత్రాంగం పనితీరుకు నిదర్శనమని అభినందించారు. జలధార ? జిల్లాకు జీవధారగా మారిందని మంత్రులు పేర్కొన్నారు. ఈ విజయానికి ప్రధాన కారకులైన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఆయన దూరదృష్టి, కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ కార్యక్రమం విజయవంతమైందని కొనియాడారు. అలాగే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసిన జిల్లా యంత్రాంగం, ఎంపీడీవోలు, ఎంపీఓలు, రెవెన్యూ శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పిలుపునిచ్చారు. చెరువు నీటితో పంటల సాగు మెరుగుపడింది ? రైతు అక్కులరెడ్డి, చిన్నమండెం మండలం చాకిబండ గ్రామ రైతు×చిన్నమండెం మండలం చాకిబండ గ్రామానికి చెందిన రైతు అక్కుల రెడ్డి మాట్లాడుతూ.., చెరువు కాల్వల పునరుద్ధరణ, అభివృద్ధి పనుల వల్ల తమ ప్రాంతంలో నీటి లభ్యత గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంలో చెరువులో నీటి నిల్వలు లేక ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లమని, ప్రస్తుతం చేపట్టిన పనుల వల్ల చాకిబండ చెరువులో నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో కూడా నీటి మట్టం మెరుగుపడిందన్నారు. దీంతో మామిడి, టమాటా, పూల సాగు వంటి పంటలను సాగు చేస్తున్నామని తెలిపారు. నీటి లభ్యత పెరగడంతో వ్యవసాయంపై నమ్మకం పెరిగి రైతులకు ఉపయోగకరంగా మారిందన్నారు. ఈ మార్పుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి రైతుగా తన కృతజ్ఞతలు మరియు నమస్కారాలు తెలియజేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పథకాలతో మహిళా పారిశ్రామికవేత్తగా ఎదిగాను:- మహిళా పారిశ్రామికవేత్త మంజుల×రెండేళ్ల ప్రభుత్వ విజయోత్సవ కార్యక్రమంలో మహిళా పారిశ్రామికవేత్త మంజుల మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, స్వయం ఉపాధి కార్యక్రమాల వల్ల మహిళలకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. చిన్న స్థాయిలో ఒక ఆవుతో ప్రారంభించిన తన ప్రయాణం ఈరోజు నెలకు సుమారు రూ.30 వేల ఆదాయం వచ్చే స్థాయికి చేరిందని తెలిపారు. ఈ ప్రయాణంలో స్వయం సహాయక సంఘాల ద్వారా, వెలుగు సంస్థ సహకారంతో, స్త్రీనిధి ద్వారా అందిన ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడిందన్నారు. అదేవిధంగా బ్యాంకు రుణ సౌకర్యాల ద్వారా మరింత విస్తరణకు అవకాశం లభించిందని చెప్పారు. ప్రస్తుతం పీఎంఈజీపీ పథకం ద్వారా రూ.10 లక్షల రుణం మంజూరు కావడంతో వ్యాపారాన్ని మరింత విస్తరించి, మరికొంత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. జలధార కార్యక్రమం ద్వారా నీటి లభ్యత మెరుగుపడటంతో పశుపోషణ రంగానికి మరింత ఊతం లభిస్తోందని పేర్కొన్నారు. నాలాంటి ఎంతో మంది మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలు ఉపయోగపడుతున్నాయని, మహిళల సాధికారతకు తోడ్పడుతున్న అన్ని కార్యక్రమాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆయిల్ పామ్ ప్లాంటేషన్ ప్రోగ్రెస్ 2026-27 సమీక్షా సమావేశం

## పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. హైమావతి




సిద్దిపేట ఆయిల్ పామ్ ప్లాంటేషన్ ప్రోగ్రెస్?2026-27 సమీక్షా సమావేశంలో మండల స్థాయి అధికారులు, టీజీ ఆయిల్‌ఫెడ్ ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కె. హైమావతి దిశా నిర్దేశనం చేస్తూ పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని అధికారులను ఆదేశించారు. మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించిన ప్రక్రియలను త్వరగా పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ప్రతి వారం పనుల పురోగతిని సమీక్షిస్తూ, నెలాఖరులోగా మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులు రైతులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూముల క్లీనింగ్, పిట్ మార్కింగ్, పిట్టింగ్ పనులను వేగవంతంగా పూర్తిచేయించాలని అన్నారు. ఆయిల్ పామ్‌తో పాటు పండ్లు, పూలు, కూరగాయల మొక్కలను నాటడానికి కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఆర్గానిక్ మరియు సీజనల్ పండ్లు, ఆకు కూరల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజలు సహజసిద్ధమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించడం మాత్రమే కాకుండా, వాటికి అవసరమైన పండ్లు, కూరగాయలు, ఆకు కూరల ఉత్పత్తిని పెంచే మొక్కల పెంపకానికి కూడా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయిల్ పామ్‌తో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్న ప్రతి రైతును ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయాలని తెలిపారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా పండ్లు, కూరగాయలు, పూల మొక్కల ఉత్పత్తిని పెంచే దిశగా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, వ్యవసాయ పథకాల ప్రయోజనాలను రైతులు కోల్పోకుండా సీఎస్ఈల సహకారంతో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ లేకపోవడం వల్ల రైతులు ఏవైనా ప్రభుత్వ ప్రయోజనాలను కోల్పోయినా, లేదా పంట సాగు చేయని రైతులకు లబ్ధి అందించినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా భవిష్యత్తులో తలెత్తే ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లాలో ప్రతి వ్యవసాయ క్షేత్రంలో ఫామ్ పాండ్ల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, టీజీ ఆయిల్‌ఫెడ్ ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు

# జెడ్పీఎస్ ఎస్ హై స్కూల్ లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ.. ప్రారంభించిన సర్పంచ్




**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 18**స్థానిక ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని జడ్పీఎస?టస్ (జడ్.పి.హెచ్.ఎస్ ) హైస్కూల్లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఈరోజు నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి కాకులమర్రి శ్రీలత చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలను అందజేసి, పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులంతా పుస్తకాలను సద్వినియోగం చేసుకుని, శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యా రంగానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. చిత్రంలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ కళావేదిక" పై పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు మరియు విద్యార్థుల సమక్షంలో ఈ కార్యక్రమం సాగింది.

పుస్తకాల పంపిణీ అనంతరం సర్పంచ్ శ్రీమతి కాకులమర్రి శ్రీలత పాఠశాల ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ పాఠశాలలోని టాయిలెట్స్ (కృత్రిమ శౌచాలయాలు)ను పరిశీలించి, వాటి పరిశుభ్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన వంటశాలను సందర్శించి, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మరియు పరిశుభ్రమైన వాతావరణంలో వండిన ఆహారాన్ని అందించాలని వంట మనుషులను మరియు ఉపాధ్యాయులను కోరారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణకు సన్నద్ధం కావాలి

## :: జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 18 కలెక్టరేట్**గురువారం ఎస్.ఐ.ఆర్ నిర్వహణ, బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏల శిక్షణ తరగతుల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైనదని, ప్రతి ఓటరుకు సరైన నమోదు, మార్పులు, సవరణలు ఖచ్చితంగా జరిగేలా అధికారులు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా, డూప్లికేట్ నమోదులను గుర్తించి, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించేలా బి.ఎల్.ఓలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 19వ తేదీ శుక్రవారం ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల వారికి ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల వారికి పి.ఎస్.ఆర్ గార్డెన్, గోవిందరావుపేటలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

20వ తేదీ శనివారం ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల వారికి ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో, 22వ తేదీ సోమవారం కొత్తగూడ, గంగారం మండలాల వారికి కొత్తగూడ రైతు వేదికలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ శిక్షణలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, పేరు, చిరునామా మార్పులు, డూప్లికేట్ నమోదుల గుర్తింపు, అభ్యంతరాల పరిశీలన, ఎన్నికల నిబంధనలు తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ వివరించారు.

మండలాల పరిధిలోని బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏలకు ముందస్తు సమాచారం అందించి, శిక్షణ తరగతులను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ములుగు నియోజకవర్గ పరిధిలోని 303 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ప్రతి కేంద్రానికి బి.ఎల్.ఓలు, సంబంధిత సూపర్వైజర్ల పేర్లు, సంప్రదింపు వివరాలను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, ఈ.ఆర్.ఓ కార్యాలయ నోటీస్ బోర్డుల ద్వారా, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ప్రతి పోలింగ్ స్టేషన్ వారీగా పోలింగ్ స్టేషన్ నంబర్, పేరు, సంబంధిత బి.ఎల్.ఓ పేరు, మొబైల్ నంబర్, బి.ఎల్.ఓ సూపర్వైజర్ పేరు, మొబైల్ నంబర్ వివరాలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలన్నారు.

ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సేవలు, మార్గదర్శకత్వం అందించడంలో బి.ఎల్.ఓలు కీలకంగా వ్యవహరించాలని, పారదర్శకత, ఖచ్చితత్వం, ప్రజల భాగస్వామ్యంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఈ టెలికాన్ఫరెన్స్ లో డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి సిహెచ్ మహేందర్ జి,ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కృష్ణవేణి, అన్ని మండలాల తహసీల్దార్లు సంబంధిత అధికారులు, ఎన్నికల సూపరిండెంట్ సలీం, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ నితీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# బొడ్రాయి ప్రతిష్ట వేడుకకు హాజరైన బి ఆర్ ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి బడే నాగజ్యోతి -జగదీష్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 18** ములుగుగురువారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని, జీవంతరావుపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి శ్రీమతి బడే నాగజ్యోతి– జగదీష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ ప్రజలు, పెద్దలు మరియు నాయకులతో కలిసి వేడుకల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, గ్రామాభివృద్ధి కోసం ప్రార్థనలు చేస్తూ బొడ్రాయి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ములుగు మండల మాజీ అధ్యక్షులు రమేష్ రెడ్డి.జిల్లా సీనియర్ నాయకులు వేములపల్లి భిక్షపతి, బైకని సాగర్. కాకి పురుషోత్తం. గొర్రె. సమ్మయ్య, దూడబోయిన, శ్రీనివాస్, దీ=ాఎ జిల్లా నాయకులు కొమరం సిద్దు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూముల రక్షణ కోసం కవచంలా భూ రక్షణ కమిటీ అన్ని కుల సంఘాల జేఏసీ



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి** ఏటూరు నాగారం మండల కేంద్రంలో గత వారం రోజులుగా జరుగుతున్న గిరిజనేతరుల సాగుభూముల కబ్జాలపై గిరిజనులు చేస్తున్న దాడులను ప్రతిఘటించడానికి ఏటూరు నాగారం మండల కేంద్రంలోని. కుల సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడి ఇక ముందు ఇలాంటి దాడులను ప్రతి గడించి భూ రక్షణ కోసం పోరాడాల్సిందే అని ఏ సమయాన మనం సాగు చేసుకునే భూములపై దాడి చేసే క్రమంలో అందరం కలిసి పనిచేయాలని ఎంత పెద్ద సమస్య అయినా ఎదుర్కొనేందుకు గ్రామస్తులంతా ప్రతిజ్ఞ చేశారు ప్రతి కులం నుంచి ఒక్కొక్కరిగా ఎన్నుకొని ఏ సమస్య ఏ కులమైన అందరం కలిసికట్టుగా పనిచేసి మన భూములను మన సమస్యలు పరిష్కరించుకోవాలని రామాలయం దేవాలయంలో ఊరి గ్రామస్తుల సమక్షంలో కమిటీ ఏర్పాటు చేశారు

ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజకీయ నాయకులు యువత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# మహిళా సంఘాల అభివృద్ధికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యేక కృషి.



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 18**మంత్రి సీతక్క ఆదేశాల మేరకుగుడ్ల దేవేందర్, ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు ఆధ్వర్యంలో..

ఏటూరునాగారంలో వివో బిల్డింగ్స్‌కు శంకుస్థాపన...

మంత్రి సీతక్క గారి కృషితో మహిళా సంఘాలకు సొంత భవనాల కల సాకారం...

మహిళల ఆర్థిక స్వావలంబనకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ...

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఏటూరునాగారంలో మహిళా సంఘాల కోసం నిర్మించనున్న వివో (వివో) భవనాలకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన చేశారు....ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహిళా సంఘాలకు సొంత భవనాలు నిర్మించడం ద్వారా వారి సమావేశాలు, కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ఈ అభివృద్ధి పనులు మంత్రి సీతక్క ప్రత్యేక కృషి, చొరవ వల్ల సాధ్యమయ్యాయని అన్నారు. మహిళల సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు స్పష్టం చేశారు.... బిఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మర్పల్లి నూతన ఎమ్మార్వో సన్మానించిన బి ఆర్ ఎస్ నాయకులు





**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 18 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి ఎమ్మార్వో గా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన మనోహర్ చక్రవర్తిని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించడం జరిగిందని తెలిపారు నూతన ఎమ్మార్వో బాధ్యతలు తీసుకున్న మనోహర్ చక్రవర్తి విధి నిర్వహణలో సాధ్యమైనంతవరకు నా వంతు కృషి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు సన్మాన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాచ య్య, జయంత్ రెడ్డి, పట్లూర్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసినయువ నాయకుడు సునీల్ సన్మానించడం జరిగిందని తెలిపారు

# 26కు మొహర్రం సెలవు మార్పు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 18 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:**రాష్ట్ర ప్రభుత్వం మొహర్రం సెలవును 26వ తేదీకి మార్పు చేసింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు,ప్రభుత్వం ముందుగా ప్రకటించిన సాధారణ సెలవుల జాబితాలో జూన్ 25న మొహర్రం సెలవుగా ప్రకటించింది,కానీ వక్ఫ్ బోర్డు సీఈవో,మొహర్రం 26న వస్తున్నదని ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు దీంతో ప్రభుత్వం జూన్ 26, మొహరం పండుగ సెలవు దినంగా ప్రకటించింది...

## ఎస్ ఐ ఆర్ ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 18 ములుగు** గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు.
ఈ సందర్భంగా హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, నమోదు, పరిష్కార విధానాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు అవసరమైన సమాచారం, మార్గదర్శకాలను సకాలంలో అందించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని సూచించారు.
అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని, పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలకు సంబంధించిన దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.
హెల్ప్ డెస్క్‌కు వచ్చే ప్రజలకు మర్యాదపూర్వకంగా స్పందిస్తూ వారి సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఎ చందర్ శేఖర్, డి పి ఆర్ ఓ రఫిక్,అడిషనల్ పీడీ శ్రీనివాస్, ఎన్నికల డి టీ నితీష్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ కళాశాలల్లో ఫీజుల భారం తగ్గించాలి విద్యా మండలికి బీజేపీ నేతల వినతి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూన్ 18**:తెలంగాణ రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న అధిక ఫీజులు, మౌలిక వసతుల కొరత, అధ్యాపకుల నియామకం, విద్యా ప్రమాణాలు తదితర సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి నాంపల్లి కార్యాలయంలో విద్యా మండలి అధికారులకు వినతిపత్రం సమర్పించారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎంబీసీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ పాల్గొని విద్యార్థుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని, ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.
ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు కూడా పాల్గొని విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి విద్యా మండలి సానుకూలంగా స్పందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

## పట్లూర్ మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్ కోడలు ఇంటర్మీడియట్ లో 975 మార్కులతో ఘనవిజయం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూన్ 18 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** పట్లూర్ మాజీ సర్పంచ్ దేవరదశి ఇందిర అశోక్ కోడలు ఇంటర్మీడియట్ లో పట్టుదలతో చదివి 975 మార్కులు రావడం పట్ల కుటుంబ సభ్యులు బంధుమిత్రులు మేనమామ మాజీ సర్పంచ్ ఇంద్ర అశోక్ మేనకోడల్ని బంధుమిత్రులతో కలిసి ఘనంగా సన్మానం చేసి విద్యాభ్యాసం విషయంలో మేము నీకు ఎల్లవేళలా అండగా ఉంటాం పట్టుదలతో చదివి నేటి పోటీ ప్రపంచంలో మంచి విద్యను అభ్యసించి ప్రధమ ర్యాంకులు పొంది ఉన్నత స్థాయిలో ఎదగాలని కుటుంబ సభ్యులు బ్లెస్సింగిస్తూ సంతోషంగా వ్యక్తపరిచారు

## ములుగు జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు 100% స్కూల్ ఫీజు రాయితీ

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 18 ములుగు** ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి ఆదేశాలు జారీ. ఇటీవలే ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన టి యు డబ్ల్యూ జే ఐ జే యు ములుగు జిల్లా అధ్యక్షులు ఎండి.షఫీ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిదురాల వాసుదేవ్ యూనియన్ సభ్యులు సీనియర్ జర్నలిస్టులు ములుగు జిల్లాలోని అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 2026-2027 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 100% శాతం ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కీలక ఆదేశాలు జారీ చేశారు ఈరోజు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి ఆర్డర్ కాపీని టి యు డబ్ల్యూ జే ఐ జే యు ములుగు జిల్లా అధ్యక్షులు ఎండి.షఫీ అహ్మద్ కి అందజేశారు ఈ కార్యక్రమంలో కొమరయ్య రామ్మూర్తి రాజు వర్ధన్ మైపాల్ రెడ్డి హరినాథ్ వేణు యాదవ్ పొన్నాల స్వామి సతీష్ హరీష్ సతీష్ గౌడ్ తదితరులు సీనియర్ జర్నలిస్టు పాల్గొన్నారు

## కెనరా బ్యాంకులో మధ్య దళారులను తొలగించాలి

: కౌతాళం మండల కేంద్రంలో కెనరా బ్యాంకులో రైతుల వ్యవసాయ రుణాలు రెన్యువల్ డబ్బులు చెల్లించడానికి వెళ్ళితే అక్కడ బ్యాంకులో మధ్య దళారులు వాళ్లతో( రైతు తో )కలిసి నీ అప్పు నేను కడతాను అని చెప్పి ,ఆయన అప్పు మధ్య దళారులు కట్టడం వల్ల ,వడ్డీ, మధ్య దళారుల కమిషన్, ఇతర ఖర్చులు అన్నీ కూడా రైతే భరించవలసి ఉంటుంది. కనుక బ్యాంకులో మధ్య దళారులను తొలగించాలని, బ్యాంకులోకి అనుమతించరాదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య మేనేజర్ కు వినతి పత్రాన్ని అందించారు.. మండలంలో ఆరు బ్యాంకులు ఉన్నా ఏ బ్యాంకుల్లో కూడా కెనరా బ్యాంకులో ఉన్నటువంటి మధ్య దళారుల వ్యవస్థ లేదు. రైతులే నేరుగా బ్యాంకుకు పోయి మేనేజర్ తో మాట్లాడి స్తోమత ఉన్నవాళ్లు అసలు ,వడ్డీ కలిపి కడతారు. స్తోమత లేని వాళ్ళు వడ్డీ మాత్రమే కట్టి రెన్యువల్ చేయించుకుంటారు అలాంటి పద్ధతి కెనరా బ్యాంకులో లేదు. ఇక్కడ మధ్య దళారులకు ,బ్యాంకు సిబ్బందికి ,మేనేజర్ లోపాయికారిగా ఒప్పందాలు చేసుకొని లావాదేవీలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. రైతు అప్పు మధ్య దళారులు కడితే సంవత్సరానికి, సంవత్సరానికి అప్పు పెరుగుతుంది తప్ప , రైతుకు అప్పు సమస్య తీరదు అని ఆయన అన్నారు .

## సంజయ్ గాంధీనగర్ లో పర్యటించిన మేయర్ మహంకాళి స్వామి



**పెద్దపల్లి/గోదావరిఖని, జూన్ 18, ప్రజాబలం:** అంటువ్యాధుల నుండి అప్రమత్తంగా ఉండాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా గురువారం 46 వ డివిజన్ సంజయ్ గాంధీ నగర్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపధ్యంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు , ఈగలకు నిలయమై అంటు వ్యాధులు విజృంభించే అవకాశం ఉంటుందని అన్నారు. డెంగ్యూ , మలేరియా వంటి అంటు వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగవలసి వస్తుందని అన్నారు. కాబట్టి చెత్త బహిరంగ ప్రదేశాలలలో , కాలువల్లో వేయకుండా నగర పాలక సంస్థ వాహనాలకు అందించాలని కోరారు. కాగా ఈ సందర్భంగా సంజయ్ గాంధీ నగర్ రోడ్ లో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి రోడ్డుకు ఇరువైపులా దారికి అడ్డంగా పెరిగిన పొదలు , చెట్ల కొమ్మలు , నాలా శుభ్రం చేయడానికి వీల్లేకుండా పైన పరిచిన రాళ్ళను తొలగించారు , నాలాల లో పూడిక తొలగించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు నవీన్, మీర్, పబ్బాల శ్రీనివాస్ . సంపత్, చంద్రా రెడ్డి, మెప్మా సిఓ ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.



## ఖని ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా కవితా రెడ్డి ను సన్మానించిన రెడ్డి సంక్షేమ సంఘం




**పెద్దపల్లి/గోదావరిఖని, జూన్ 18, ప్రజాబలం:** నూతనంగా డిపో మేనేజర్ గా బాధ్యతలు తీసుకున్న చల్లా కవితారెడ్డిని గోదావరిఖని రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు సన్మానించారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్ స్టాండ్ కార్యాలయంలో రెడ్డి సంఘం ప్రతినిధులు డిపో మేనేజర్ కవితారెడ్డి నీ కలిసి శాలువాతో సన్మానించి, పూల బొకే ను అందించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ గోదావరిఖని ఆర్టీసీ డిపోకు నూతన బాధ్యతలు తీసుకున్న కవిత రెడ్డికి స్వాగతం పలుకుతున్నట్లు ప్రయాణికుల సౌకర్యంలో మంచి సేవలు అందించాలని కోరారు. సంఘం తరఫున ఏలాంటి సహాయ సహకారాలు అవసరం ఉన్నా తమ వంతుగా ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు ఈద జగన్మోహన్ రెడ్డి, ఉమ్మెత్తుల దేవేందర్ రెడ్డి, చందుపట్ల తిరుపతి రెడ్డి, చల్లా రవీందర్ రెడ్డి, పెంద్రి రమణ రెడ్డి, సందుపట్ల తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## అమరావతికి ట్రాఫిక్ ఫ్రీ జర్నీ.. నాలుగు లైన్లతో కొత్త ఆర్వోబీ..

విజయవాడ, జూన్ 18, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వెళ్లేవారి కష్టాలు తొలగిపోనున్నాయి. మంగళగిరి నుంచి రాజధాని ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఇబ్బందిగా మారిన నిడమర్రు రైల్వే లెవెల్ క్రాసింగ్ సమస్యకు పరిష్కారం లభించింది. నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ దగ్గర రైల్వే ఓవర్ బ్రిడ్జికి గ్రీన్‌సిగ్నల్ రాగా.. ఇవాళ కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేష్‌లు శంకుస్థాపన చేశారు. రూ.142 కోట్లతో ఈ ఆర్వోబీని నిర్మించనున్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించింది.గుంటూరు జిల్లా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల మంగళగిరి నుంచి అమరావతి, తాడికొండ వైపు రాకపోకలు కొనసాగించేవారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవి. అక్కడ తరచూ గేటు మూయడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రద్దీ సమయంలో వాహన రాకపోకలు ఆగిపోవడంతో పాటుగా ప్రయాణ సమయం పెరగడం, అత్యవసర సేవలకు అంతరాయం ఎదురైంది. అలాగే మంగళగిరి దగ్గర ఉన్న క్రికెట్ స్టేడియానికి వెళ్లవారికి ఇబ్బందులు తప్పలేదు. ఈ విషయం మంత్రి లోకేష్‌కు తెలియడంతో ఆయన చొరవ తీసుకుని ఆర్వోబీ కోసం రైల్వే అధికారులకు రిక్వెస్ట్ చేయడంతో మంజూరు చేశారు. ఈ ఆర్వోబీ పూర్తయితే అమరావతి, తాడికొండ, మంగళగిరి, నిడమర్రు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయి. మంగళగిరి నుంచి నిడమర్రు, బేతపూడి, నీరుకొండ, కురగల్లు గ్రామాల ప్రజలకు ప్రమాయణ సమయం తగ్గుతుందని చెబుతున్నారు.నిడమర్రు ఆర్వోబీ 10 మీటర్ల ఎత్తు, 767.50 మీటర్లు పొడవు, 28 మీటర్ల వెడల్పుతో నాలుగు లైన్లుగా నిర్మించనున్నారు. రైల్వే లైన్ నుంచి మంగళగిరి వైపు 405.50 మీటర్లు, అమరాతి వైపు 362 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. ఆర్వోబీ నాలుగులైన్లుగా.. ప్రతి లైను 3.75 మీటర్లు.. గ్యారేజ్ వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా క్రాస్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్డు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు(5.5x2) 5.5 మీటర్ల వెడల్పు ఉంటుంది. రోడ్లతో కలిపి మొత్తం వంతెన వెడల్పు 28 మీటర్లు ఉంటుంది. నిడమర్రు ఆర్వోబీకి శంకుస్థాపన చేయడంతో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ కోసం జిల్లాలో ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం నిర్వహించబడుతున్నాయని పోలీసులు తెలిపారు.

# విద్యార్థిలో ప్రాథమిక నైపుణ్యాల సాధన లక్ష్యంగా పనిచేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

## కాంప్లెక్స్ హెచ్ఎంలతో విద్యాశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, జూన్-18, ప్రజాబలం ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, ప్రాథమిక గణితంలో కనీస నైపుణ్యాలను సాధించేలా లక్ష్యబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో విద్యాశాఖ కాంప్లెక్స్ హెచ్ఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ విద్యా కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులకు తగిన శిక్షణ అందించి,



ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పిల్లల్లో ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి ప్రతి కాంప్లెక్స్ స్థాయిలో లక్ష్యాలు నిర్దేశించుకోవాలని, ఆయా కాంప్లెక్స్‌ల పరిధిలోని ప్రతి పాఠశాలకు ప్రత్యేక లక్ష్యాలు నిర్ణయించి వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అందరూ ఒక బృందంగా పనిచేసి ప్రాథమిక నైపుణ్యాల సాధన లక్ష్యాన్ని చేరుకోవాలని, విద్యా సంవత్సరం మొత్తం ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. గత ఏడాది జిల్లాకు మంచి ఫలితాలు వచ్చాయని, ఈ విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధిని ఉపాధ్యాయులు తమ బాధ్యతగా స్వీకరించాలని, పాఠశాలల్లో ఎదురయ్యే ఏ సమస్యనైనా ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని తెలిపారు. అవసరమైతే కాంప్లెక్స్ స్థాయిలో వర్క్ అడ్జస్ట్మెంట్ చేసుకుని, ఆ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద, అకడమిక్ అధికారి పి.ఎం. షేక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఫ్రీ ఎడ్యుకేషన్: డీఈఓ రోహిణి


GOVERNMENT OF TELANGANA
EDUCATION DEPARTMENT

From
R.Rohini, M.Sc.,M.Ed.
District Educational Officer,
Sangareddy

To
All the Correspondents/ Managements of
Private Recognized Schools,
Sangareddy District

Lr.No.1877/B1/2026, Dtd: .06.2026

Sir/Madam,

Sub: School Education Department - Sangareddy District - Providing Free Education to the Children of Working Journalists in Sangareddy District - Request - Reg.

Ref: Representations received from various Journalists' Unions.

>>O<<

It is informed that, representations have been received from various Journalists' Unions requesting free education facilities for the children of working journalists.

In this regard, all the Correspondents/Managements of Private Recognized Schools in Sangareddy District are hereby requested to extend support by providing free education, as far as possible, to the children of working journalists of Sangareddy District, as a measure of encouragement to the journalistic community.

Your cooperation in this matter is highly appreciated.

Yours faithfully,

District Educational Officer
SANGAREDDY

Copy to all the Mandal Educational Officers in the District for information and necessary action.
Copy to the Journalists' Unions concerned for information.

**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 18 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** 2026-27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్, పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని జిల్లా విద్యాధికారి ఆర్. రోహిణి, ఆదేశాలు జారీ చేశారు.వివిధ జర్నలిస్టు సంఘాల, వినతి మేరకు వాతీ.చీశీ.1877/దీ1/2026, ఈనెల 16వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులను జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓలకు, జర్నలిస్టు సంఘాల నాయకులకు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు పంపించారు,ఈసందర్భంగా డీఈఓ రోహిణి, మాట్లాడుతూ, సమాజ హితం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టుల సేవలు అమూల్యమైనవి,వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందాలన్నదే మా లక్ష్యం. పాఠశాలలయాజమాన్యాలు, సహృదయంతో సహకరించాలి ఉచిత విద్య కల్పనలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత మండల విద్యాధికారులను సంప్రదించవచ్చు. ఇది జర్నలిస్టు సమాజానికి అందించే ప్రోత్సాహం" అని పేర్కొన్నారు...

# ప్రకృతిని రక్షిద్దాం.. భావితరాలకు ప్రాణవాయువును అందిద్దాం - ఎంపీడీవో మహేందర్ రెడ్డి



**జహీరాబాద్, జూన్ 18 ప్రజాబలం ప్రతినిధి:** వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని జహీరాబాద్ మండల ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లీ గ్రామంలో వన మహోత్సవం - 2026 కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏపీఓ అశోక్, అలాగే గ్రామస్తులతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటం అత్యంత ఆవశ్యకం అని పేర్కొన్నారు. భావితరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని, సహజ సిద్ధమైన ప్రాణవాయువును అందించేందుకే ఈ వన మహోత్సవం ద్వారా విస్తృతంగా మొక్కలు నాటుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలంటే కేవలం అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. అలాగే నాటిన ప్రతి మొక్కనూ కంటికి రెప్పలా సంరక్షించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు గ్రామస్తులు పాల్గొని మొక్కలు నాటారు.

# విస్తృత స్థాయిలో, బాధ్యతాయుతంగా మొక్కలు నాటాలి.

## ములుగులో అటవీ సిబ్బందికి నూతన సదుపాయాలు.

## జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 18** ములుగురాష్ట్రంలో పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ, అటవీ సంపద అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ చేపట్టిన వన మహోత్సవం--2026 కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ ఎకో పార్క్‌లో మొక్క నాటి ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.35.50 కోట్ల విలువైన అటవీ, పర్యావరణ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో రూ.17.84 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అదేవిధంగా ములుగు సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రూ.17.66 కోట్ల విలువైన అర్బన్ పార్కులు, ఎకో పార్కులు, వన్యప్రాణి సంరక్షణ, జూ ఆధునీకరణ, నివాస భవనాలు, పర్యావరణ మౌలిక వసతుల అభివృద్ధి పనులను వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

ఈ క్రమంలో ములుగు జిల్లా జాకరం కేంద్రంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ క్వార్టర్స్‌తో పాటు అటవీ శాఖ ఫ్రంట్‌లైన్ సిబ్బందికి నూతన మౌలిక వసతులను ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డి ఎఫ్ ఓ వికాస్ మీనాలతో కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది 12 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్ణయించామని, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఈ లక్ష్యాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. విస్తృత స్థాయిలో, బాధ్యతాయుతంగా మొక్కల నాటకం చేపట్టాలని సూచించారు. అన్ని శాఖలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతాయని, ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా మాట్లాడుతూ, జిల్లాలో వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శాఖల వారీగా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా విస్తృత స్థాయిలో మొక్కల నాటకం చేపట్టడంతో పాటు, నాటిన ప్రతి మొక్క సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి పెంపకం, పరిరక్షణ కూడా సమానంగా ముఖ్యమని, అన్ని శాఖల సమన్వయంతో జిల్లాను మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు అటవీ శాఖ కట్టుబడి ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో జాకారం సర్పంచ్  సర్పంచ్ సమత, అటవీ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనం 26 వేల తో పాటు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

## సిఐటియు రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్




**వేములవాడ ప్రజాబలం దినపత్రిక ప్రతినిధి జూన్ -18** వేములవాడ మున్సిపల్ కార్మికుల జీతాలను 26 వేల రూపాయలుగా పెంచాలని , 60 సంవత్సరాలు పైబడిన కార్మికుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని గురువారం రోజున వేములవాడ మున్సిపల్ కార్యాలయం ముందు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వేములవాడ మున్సిపల్ ఆఫీసు ముందు రెండు రోజులపాటు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మూషం రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్ మాట్లాడుతూ కార్మికుని కష్టానికి సరైన జీతం లేదని పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి కార్మికుల కష్టాన్ని గుర్తించి మున్సిపల్ లో పనిచేస్తున్న వారికి కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబంలో అదే స్థానాన్ని కొనసాగించాలని, 60 సంవత్సరాల పైబడిన కార్మికుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని, ఈఎస్ఐలు సక్రమంగా చెల్లించాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో , పట్టణ అధ్యక్షులు సరిపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి దుబ్బల లచ్చయ్య, ఉపాధ్యక్షులు సుంకపాక పర్ష రాములు, శ్రావణపల్లి శ్రీనివాస్, బొట్టు శ్రీనివాస్, ఇప్పపూల అనీష్ గాజుల వజ్రమ్మ, బావిలాల లక్ష్మి, పుప్పాల మమత, తదితరులు కార్మికులు నిరసనలో పాల్గొన్నారు.

# గుంటూరు మిర్చికి చైనా షాక్

గుంటూరు, జూన్ 18, మనదేశంలో మిరప ఎక్కువగా పండించే రాష్ట్రాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉంటాయి. ఇక్కడ పండే మిరపకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా టమాటా మిర్చి.. తేజ రకం మిర్చికి ఈ రెండు రాష్ట్రాలు పెట్టింది పేరు. అందువల్లే చైనా వ్యాపారులు మన తెలుగు రాష్ట్రాలలో పండిన మిరపకాయలను ఎక్కువగా కొనుగోలు చేస్తూ ఉంటారు. ఎండు మిరపకాయల నుంచి కారం మాత్రమే కాకుండా.. కృత్రిమ రంగులలో ఉపయోగించే రసాయనాలను తయారు చేస్తూ ఉంటారు. ఈ రసాయనాలకు చైనాలో విపరీతమైన డిమాండ్ ఉంటుంది.సాధారణంగా మిర్చిలో రైతులు ఎక్కువగా క్రిమిసంహారకాలు వాడుతుంటారు. మిరప అనేది అత్యంత సున్నితమైన పంట. ఎక్కువ దిగుబడి సాధించడానికి రైతులు విపరీతంగా క్రిమిసంహారకాలు వాడుతూ ఉంటారు. గతంలో క్రిమిసంహారకాల వాడకం ఒక స్థాయి వరకు ఉండేది. కొంతకాలంగా మిరప మీద తెగుళ్ల విపరీతంగా దాడి చేస్తున్న నేపథ్యంలో దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. అందువల్ల రైతులు క్రిమిసంహారకాలను ఎక్కువగా వాడాల్సి వస్తోంది. దేశీయంగా పెద్దగా ఇబ్బందులు లేకపోయినప్పటికీ.. ఎగుమతి అయ్యే మిరప విషయంలోనే కష్టాలు ఎదురవుతున్నాయి.మన దగ్గర పండిన మిర్చి ఎక్కువగా చైనా దేశానికి ఎగుమతి అవుతూ ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో రెండు కంటైనర్ల మిర్చి మన దేశానికి చైనా తిరిగి పంపింది. దీనికి ప్రధాన కారణం క్రిమిసంహారకాలు అధికంగా ఉండటమే. ఈ స్థాయిలో క్రిమి సంహారకాలు వాడిన మిరపని పంపిస్తే తీసుకునేది లేదని చైనా స్పష్టం చేసింది. దీంతో మిరప వ్యాపారులు ఆందోళన చెపుతున్నారు. మిరపలో క్రిమిసంహారకాల వాడకాన్ని తగ్గించే విధంగా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని.. రైతులు సహజ సిద్ధమైన పద్ధతుల్లో మిరపని పండించే విధంగా చూడాలని వ్యాపారుడు కోరారు. పదేపదే పురుగుమందుల అవశేషాల ఉల్లంఘన జరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో భారత మార్కెట్ విలువ పడిపోతుందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చైనాకు ఎగుమతి అవుతున్న మిరపలో మెతా మెడోఫాస్.. మోనోక్రోటఫాస్.. ప్రొఫెనోపాస్.. ట్రయాజోపాస్.. ఇథియాన్.. క్లోరోపైరీఫాస్.. ఫిప్రోనిల్ వంటి ఆందోళన కలిగించే క్రిమిసంహారకాలు ఉన్నాయని ఆంధ్ర ప్రదేశ్ మిరప వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు.. ప్రధాన కార్యదర్శి తోట రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. చైనా ప్రధానంగా ఈ క్రిమిసంహారకాలను చూపించి ఎగుమతులను తీసుకోవడం లేదని వారు పేర్కొన్నారు.. అంతేకాదు ప్రభుత్వం ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని.. రైతులకు మేలైన విత్తనాలు.. పంట దిగుబడిలో తీసుకోవాల్సిన సూచనలు.. తెగుళ్ల బారిన పడకుండా మేలైన దిగుబడి అందించే వంగడాలను రూపొందించాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు.రైతులకు పురుగుమందులు అమ్మే డీలర్ల మీద కఠినమైన పర్యవేక్షణ కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించారు.. గుంటూరు.. పల్నాడు.. ప్రకాశం.. కర్నూలు.. నంద్యాల.. తెలంగాణ.. కర్ణాటక వంటి రాష్ట్రాలలో మిరప పండించే రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందని మిరప వ్యాపారులు చెబుతున్నారు. సక్రమంగా ఎగుమతులు చేయని పక్షంలో దేశీయంగా రేటు పడిపోతుందని.. అది రైతులకే నష్టం చేకూరుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com